ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ప్రకాశం

జిల్లా వార్తలు

శనివారం 30, ఆగస్టు 2025





ఆరేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ కాలంలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి బిల్లులు రాక ఎదురుచూస్తున్న వారికి రాష్ట్రప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆ పనులకు బిల్లులు చెల్లించకుండా వాటిని వైసీపీ ప్రభుత్వం ఏకంగా క్లోజ్ చేసింది. ఆన్‌లైన్ అకౌంట్లు సైతం మూసివేయడంతో ఆ బిల్లులు రాక అప్పట్లో పనులు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాంటి వారికి ప్రస్తుతం చెల్లింపులకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలా పెండింగ్ ఉన్న వాటిలో రూ.10.24 కోట్ల బిల్లులకు లైన్‌క్లియర్ చేసింది. మరో పది రోజుల్లో ఆ బిల్లులకు సంబంధించిన నగదు వారి వారి ఖాతాల్లో జమ కానుంది. మరో రూ.6.80 కోట్ల మేర పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కూడా అవకాశం ఉంది. వాటికి అవసరమైన రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు.



లైన్‌క్లియర్

రూ.10.24కోట్ల ఉపాధి పెండింగ్ బిల్లులకు మోక్షం

- ఎఫ్‌టీవోలను అప్‌లోడ్ చేసిన డ్వామా అధికారులు
- ఆరేళ్ల తర్వాత అందనున్న నిధులు
- మరో రూ.6.80 కోట్ల చెల్లింపునకు అవకాశం
- అవసరమైన రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు
- గత వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి చెల్లింపులకు బ్రేక్

ఒంగోలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గతంలో టీడీపీ అధికారంలో ఉన్న (2014-19) మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఉపాధి హామీ పనులు జరిగాయి. ఆ పథకం కింద ఒకవైపు లక్షలాది మంది కూలీలకు కోట్లాది రూపాయల నగదు వేతన రూపంలో అందింది. మరోవైపు మెటీరియల్ కోటా నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున రోడ్లు, డ్రైన్లు, ప్రహరీలు, వివిధ నిర్మాణాలు, శ్మశానాల అభివృద్ధి, ఇతరత్రా అనేక పనులు చేపట్టారు. జిల్లాలో ఆ ఐదేళ్ల కాలంలో సుమారు వెయ్యి కోట్ల మేర మెటీరియల్ కోటా పనులు చేశారు. వాటికి ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులు జరిగాయి. 2019 ఎన్నికల సమయానికి ముందు చేసిన పనులకు సంబంధించి రూ.50 కోట్ల మేర బిల్లులు నిలిచిపోగా, మరికొన్ని పనులను డ్వామా సిబ్బంది రికార్డు చేయలేదు. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ నాడు పనులు చేసింది టీడీపీ

మిగతా 6వ పేజీలో

అత్యధికంగా ముండ్లమూరు మండలంలోనే..

మండలాల వారీగా చూస్తే అత్యధికంగా ముండ్లమూరు మండలానికి రూ.1.01 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉంది. అర్ధవీడు మండలంలో రూ.71.71 లక్షలు, సీఎస్‌పురం మండలంలో రూ.61.44 లక్షలు ఉన్నాయి. అలా అన్ని మండలాల్లో ఉన్నాయి. వారం పదిరోజుల్లో వారికి నగదు అందనుంది. మరో రూ.6.80 కోట్లకు సంబంధించి రికార్డుల పరిశీలన పూర్తిచేసి ఎఫ్‌టీవోలను అప్‌లోడ్ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. వాటిలో కొన్నింటికి రికార్డులు అందుబాటులో లేక ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఇక మూడో కేటగిరీలో అసలు చేసిన పనిని అప్పట్లో రికార్డు కూడా చేయనవిగా ఉన్న వాటిపై క్షేత్రస్థాయిలో డ్వామా, పీఆర్ అధికారులు దృష్టి సారించారు. వాటి మంజూరు, ఇతరత్రా రికార్డులను పరిశీలిస్తున్నారు. అవసరమైన పత్రాలు లభిస్తే వాటిని కూడా నమోదు చేసి బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉపాధి అక్రమార్కులపై ఉదాసీనత

- పనుల్లో అవినీతిని తగ్గించి చూపే ప్రయత్నాలు
- ఆర్థిక నేరస్థులను కాపాడుతున్న వైనం

7



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

652 మంది అభ్యర్థులు హాజరు

ఒంగోలు విద్య, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీలో మెరిట్ సాధించి ఎంపిక జోన్‌లో నిలిచిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్ యాజమాన్యాల్లో మొత్తం 629 పోస్టులకు 652 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మొదటి రోజైన గురువారం 568 మందిని పరిశీలనకు పిలవగా 12 మంది గైర్హాజరయ్యారు. వీరిలో కొందరు సమాచారం లోపం వల్ల హాజరు కాలేకపోయారు. దీంతో వారందరికీ డీఈవో కార్యాలయం నుంచి అధికారులు ఫోన్ చేశారు. వీరిలో తొమ్మిది మంది శుక్రవారం పరిశీలనకు హాజరయ్యారు. మిగిలిన ముగ్గురు ఇప్పటికే వేరే ఉద్యోగాల్లో స్థిరపడిపోవడంతో వారు రామని తెలియజేస్తూ డీఈవోకు

మిగతా 6వ పేజీలో

మిగతా 6వ పేజీలో



మరో రూపాయి

- ఒంగోలు-1లో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.301
- నాలుగు కేంద్రాల్లో ముగిసిన అనుమతించిన పంట కొనుగోళ్లు

ఒంగోలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో గరిష్ఠ ధర మరో రూపాయి పెరిగింది. ఇప్పటి వరకు కిలో రూ.300 ఉండగా శుక్రవారం ఒంగోలు-1 కేంద్రంలో మరో రూపాయి పెరిగి రూ.301 లభించింది. మొత్తం 11 కేంద్రాల్లో ఏడుచోట్ల వేలం ప్రక్రియ కొనసాగింది. గరిష్ఠ ధర కిలోకు ఒంగోలులో రూ.301, పొదిలిలో రూ.292 లభించింది. మిగిలిన ఐదుచోట్ల రూ.300 పలికింది. అలాగే పలు కేంద్రాల్లో కనిష్ఠ ధర కిలో రూ.130గా ఉంది. పొదిలిలో రూ.120 పలికింది. అదే సమయంలో నోబిడ్‌లు కూడా ఇంచుమించు 24శాతం మేర ఉన్నాయి. అత్యధికంగా పొదిలిలో 36.02 శాతం నోబిడ్ అయ్యాయి. మొత్తం ఏడు కేంద్రాల్లో శుక్రవారం 5,897 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 3,815 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,578 నోబిడ్ అయ్యాయి. మరికొన్ని బేళ్లు వివిధ రూపాలలో తిరస్కరణకు గురయ్యాయి. ఇదిలాఉండగా పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన పరిమాణం మేర కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి, కనిగిరి కేంద్రాల్లో అమ్మకాలు పూర్తయ్యాయి. అధిక పంట ఉత్పత్తి కొనుగోళ్లపై కేంద్రం నుంచి పొగాకు బోర్డుకు ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదు. దీంతో ఆ నాలుగు కేంద్రాల్లో తాత్కాలికంగా వేలం నిలిపేసి మిగిలిన ఏడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు.



మద్దిపాడులోని రేషన్ షాపులో నిల్వ వివరాలను తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ

జిల్లావ్యాప్తంగా తనిఖీలు

- ఎరువుల దుకాణాలు, రేషన్ షాపులు, పెట్రోలు బంకుల్లో రికార్డుల పరిశీలన
- రంగంలోకి రెవెన్యూ, విజిలెన్స్
- మద్దిపాడు మండలంలో జేసీ గోపాలకృష్ణ విస్తృత సోదాలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ సంస్థల్లో అధికార యంత్రాంగం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. నెలవారీ కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు 185 సంస్థల్లో ఈ ప్రక్రియను చేపట్టింది. రెవెన్యూ, విజిలెన్స్, పౌర సరఫరాల శాఖల అధికారులు జిల్లావ్యాప్తంగా ఎరువుల దుకాణాలు, హోటల్స్, సినిమా థియేటర్లు, రేషన్ షాపులు, ఎఫ్‌సీఐ గోడౌన్లు, ఆర్వో ప్లాంట్లు, గ్యాస్ ఏజెన్సీలను విస్తృతంగా తనిఖీ చేశారు. జేసీ గోపాలకృష్ణ మద్దిపాడు మండలంలోని పలు సంస్థలను పరిశీలించారు. సీతారాంపురంలోని పెట్రోలు బంకును తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. మద్దిపాడులో

మిగతా 6వ పేజీలో





ఒంగోలులోని కర్నూల్‌రోడ్డు ఫ్లై ఓవర్ సమీపంలో వినాయకుడి విగ్రహం వద్ద నాట్యం చేస్తున్న బాలికలు

గణపతిం భజే

గణేశుడి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు నిత్యం పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. ఒంగోలులోని ఆర్టీసీ కాలనీలో రూ.3లక్షల కరెన్సీ నోట్లతో విఘ్నేశ్వరుడికి చేసిన అలంకరణ ఆకట్టుకుంది.

విశ్రాంత తహసీల్దార్‌పై విచారణ

బేస్తవారపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండల తహసీల్దార్‌గా 2020వ సంవత్సరంలో పనిచేసి రిటైర్ అయిన నిమ్మరాజు వెంకటేశ్వర్లు అక్రమాలపై విచారణ చేయాలని కలెక్టర్ అన్సారియాకు శుక్రవారం ఉత్తర్వులు అందాయి. మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె గ్రామ సర్వే నంబర్ 18/1లో 5 ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించి పట్టాదారును తొలగించి తహసీల్దార్ కుటుంబంలో ఒకరికి అక్రమంగా పాసు పుస్తకం ఇచ్చారు. అడంగల్, 1బీలో పేరు నమోదు చేయించారు. దీనిపై లోకాయుక్తలో కేసు నమోదైంది. ఈమేరకు విశ్రాంత తహసీల్దార్ నిమ్మరాజు వెంకటేశ్వర్లుపై విచారణ నిర్వహించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి నుంచి శుక్రవారం కలెక్టర్‌కు ఉత్తర్వులు వచ్చాయి

నిమజ్జనంపై నిఘా

- తీరంలో పటిష్ఠ భద్రత
- ఐదు డ్రోన్లు, సీసీ కెమెరాలు, ఫ్లడ్ లైట్లు
- గజ ఈతగాళ్లు, నాటు పడవలు సిద్ధం
- అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు
- తీరాన్ని పరిశీలించిన ఎస్పీ దామోదర్



కొత్తపట్నం బీచ్ వద్ద పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ దామోదర్

కొత్తపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం నిఘా నీడలో సాగనుంది. వినాయక చవితి పర్వదినం సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేసే సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎక్కువ సంఖ్యలో తీరానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. తీరంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు కూడా విధించారు. అల్లర్లు, భక్తుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని చర్యలు చేపట్టేందుకు తీరంలో ఐదు

మిగతా 6వ పేజీలో

బార్.. వద్దు బాబోయ్!

- వెనక్కి తగ్గిన దరఖాస్తుదారులు
- 26కుగాను 17కు మాత్రమే అర్హత
- మొత్తం 78 దరఖాస్తులు రాక
- దర్శి బార్‌కు రెండే!



ఒంగోలు క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బార్‌ల నిర్వహణకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దరఖాస్తు గడువు పెంచినా ప్రయోజనం కనిపించ లేదు. జిల్లాలో 26 బార్లు ఉండగా 17కు మాత్రమే 4 దరఖాస్తుల చొప్పున దాఖలయ్యాయి. ఒంగోలులో మొత్తం 16 బార్లు ఉండగా 11కు మాత్రమే లాటరీకి అర్హత లభించింది. వీటికి నాలుగు చొప్పున అప్లికేషన్లు వచ్చాయి. మార్కాపురంలో 5 బార్లు ఉండగా రెండుకు మాత్రమే లాటరీ అర్హత వచ్చింది. గిద్దలూరు, చీమకుర్తి, కనిగిరి, పొదిలిలో ఒక్కో బార్‌కు నాలుగేసి అప్లికేషన్లు వచ్చాయి. దీంతో వాటికి లాటరీ వేయనున్నారు. దర్శికి కేటాయించిన బార్‌కు కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈ కారణంగా దానికి లాటరీని నిలిపివేస్తారు. శనివారం జరిగే లాటరీలో 16 బార్లకు మాత్రమే లాటరీ వేయనున్నారు. మొత్తం 26 బార్లకు 78 దరఖాస్తులు అందాయి. నాలుగు అప్లికేషన్లు రాని బార్‌కు లాటరీ వేయరు. వ్యాపారులు చెల్లించిన దరఖాస్తు ఫీజు తిరిగి ఇస్తారు.



త్రిపురాంతకం వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

వరినాట్లు ముమ్మరం

సాగుకు సరిపడా సాగర్ నీరు

త్రిపురాంతకం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సాగర్ నీరు సరిపడా సరఫరా అవుతుండటంతో రైతులు వరినాట్లు ముమ్మరం చేశారు. ప్రస్తుతం జిల్లాలో ప్రవేశించే సరిహద్దు 85/3 మైలు వద్ద 2,746 క్యూసెక్కుల నీరు కాలువలో ప్రవహిస్తోంది. ఇందులో త్రిపురాంతకం పరిధిలోని ఉమ్మడివరం, ముడివేముల, మిరియంపల్లి మేజర్ల ద్వారా 72 క్యూసెక్కుల నీరు రైతుల కోసం సరఫరా చేస్తున్నారు. మండల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 2,483 హెక్టార్లలో వరి సాగు కావచ్చని చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 361 హెక్టార్లలో వరినాట్లు వేశారు. ముడివేముల, మిరియంపల్లి, విశ్వనాథపురం, సోమేపల్లి, వెల్లంపల్లి-1, 2, దివిపల్లి, హసనాపురం మేజర్లలో వరినాట్లు వేయటానికి రైతులు సిద్ధమయితే వారికి కూడా సకాలంలో నీరు అందిస్తామని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ఇస్తున్న మూడు మేజర్లు కాకుండా వచ్చేనెల 1 నుంచి అన్ని మేజర్లకు రైతులు కోరిన చోట సాగర్ నీరు సరఫరా చేస్తామని ఎన్నెస్పీ డీఈ విజయలక్ష్మి తెలిపారు. మొత్తానికి ఈ ఏడాది సాగర్‌నీరు ముందుగానే విడుదల కావటంతో రైతులు కూడా ఉత్సాహంతో వరిసాగుకు కదులుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● ఒంగోలులో స్కానింగ్ సెంటర్లను పరిశీలించిన డీఎంహెచ్‌వో



ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలలో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నగరంలోని ప్రైవేటు వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మొత్తం తొమ్మిది సెంటర్లను పరిశీలించారు. ఆస్పత్రులలో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులు చూశారు. అక్కడ రోగులకు అందిస్తున్న సేవలతోపాటు వాటి వివరాలు నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరు ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్‌ను ఎస్టాబ్లిస్మెంట్ యాక్ట్ 2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైతే నమోదు చేసుకోరో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పొల్యూషన్, ఫైర్, బయోమెడికల్ వేస్టేజ్ అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆస్పత్రులు అందిస్తున్న సేవలు వాటికి వారు వసూలు చేసే ధరల పట్టికలను కూడా బోర్డుల్లో ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో డాక్టర్ శ్రావణ్‌కుమార్, మాస్ మీడియా అధికారి డి. శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు

మొత్తం ఆరుగురు పట్టుబడ్డారు

పరారీలో సూత్రధారి, మరో ముగ్గురు

వారినీ కలుగు నుంచి బయటికి తీసుకొస్తాం..!

డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామంలోని కొండపైన ఉన్న రంగనాయకస్వామి దేవాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కనిగిరిలోని హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ కేసు వివవాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 22న నందనవనంలోని అడవిలో కొండపై ఉన్న మల్లప్పశెల రంగనాయకస్వామి ఆలయ గర్భగుడి కింద బంగారు గని ఉందని గుడి వెనుక భాగం నుంచి గర్భగుడి కిందకు పెద్ద గుంత తీశారు. అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించే క్రమంలో ఓ గ్రామస్థుడికి వారు కనిపించారు. అనుమానం వచ్చిన గ్రామస్థుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో తన పర్యవేక్షణలో సీఐ ఖాజావలి ఆధ్వర్యంలో ఎస్ఐ మాధవరావు, పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో హెచ్‌ఎంపాడు మండలానికి చెందిన గిద్దా ఏడుకొండలు, కండె మధుబాబు, సుంకిశాల రీగన్, కనిగిరి పట్టణానికి చెందిన పాలపర్తి రాజు, షేక్ పాచ్చావలి, పామూరు పట్టణానికి చెందిన వేముల ఏడుకొండలు ఉన్నారని డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు వెల్లడించారు. సూత్రధారి మరో ముగ్గురు పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు.

సూత్రధారిని త్వరలో పట్టుకుంటాం

నందనవనంలోని దేవాలయంలో తవ్వకాలకు పాల్పడిన ముఠాను అరెస్ట్ చేసి విచారించగా కనిగిరి మండలంలోని యడవల్లి గ్రామ సర్పంచ్, వైసీపీ నేత కాసుల పెద్దగురవయ్య గుప్తనిధుల తవ్వకాలకు ప్రధాన సూత్రధారి అని తేలిందని డీఎస్పీ తెలిపారు. పాడుబడిన దేవాలయాలను ఎంచుకుని వాటిల్లో నిధుల కోసం తవ్వకాలు చేపడుతూ వచ్చిన డబ్బుతో జల్సాగా తిరుగుతుంటాడని పేర్కొన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఓ ముఠాను తయారు చేసుకున్నాడని, అందులోని ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారన్న విషయాన్ని తెలుసుకున్న పెదగురవయ్య పరారయ్యాడని తెలిపారు. అతనితోపాటు వెలిగండ్లకు చెందిన కారుమంచి ఖజావలి, శివారెడ్డి, ఎలికావారిపల్లికి చెందిన పగడాల చెన్నరాయుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే వారికోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. సూత్రధారిని కలుగు నుంచి బయటికి తీసుకువచ్చి అరెస్ట్ చేస్తామని తెలిపారు. తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం అందగానే అప్రమత్తమై చాకచక్యంగా నిందితులను పట్టుకున్న సీఐ ఖాజావలి, ఎస్ఐ మాధవరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

లైన్‌క్లియర్

(5వ పేజీ తరువాయి)

మద్దతుదారులు కావడంతో వారిపై కక్షగట్టి బిల్లులను ఆపేసింది. వాటిలో సుమారు రూ.20 కోట్ల మేర అన్ని రికార్డులు నమోదు చేసి నగదు బదిలీ ఉత్తర్వులు (ఎఫ్‌టీవో)లు కూడా అప్‌లోడ్ చేసి ఉండగా, మరో రూ.30 కోట్ల మేర పనులకు కొంత చెల్లింపులు చేసి మరికొంత చెల్లించాల్సి ఉంది. చేసిన పని మేరకు రికార్డులు చేసినవి ఉండగా ఎఫ్‌టీవోలు మంజూరు చేసిన బిల్లులను చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది.

వివరాల నమోదు ఆపేశారు

రెండో కేటగిరీలో కొంత చెల్లింపు చేసి ఇంకా రికార్డులు పూర్తిచేయాల్సి ఉన్న వాటిని భవిష్యత్‌లో ఎఫ్‌టీవోలు అప్‌లోడ్ కూడా చేసే అవకాశం లేకుండా ఉపాధి పనుల సాఫ్ట్‌వేర్‌లో ఆ వివరాల నమోదును నాటి వైసీపీ ప్రభుత్వం తొలగించి వేసింది. ఇక మూడో కేటగిరీలో కొన్ని పనులకు అసలు డ్వామా లేదా ఆ పనులను పర్యవేక్షించిన పీఆర్, ఇతర శాఖల సిబ్బంది రికార్డులు చేయడమే జరగలేదు. అలాంటివి మరో రూ.20 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. అలా సుమారు జిల్లాలో రూ.70 కోట్ల మేర పెండింగ్ బిల్లులు నిలిచిపోయాయి. వీటిలో పనులు చేసి ఎఫ్‌టీవోలు కూడా అప్‌లోడై ఉన్న వాటికి సంబంధించి కొందరు కోర్టును ఆశ్రయించి బిల్లులు పొందగలిగారు. మిగిలినవన్నీ ఆరేళ్లకుపైగా అలాగే ఆగిపోయాయి. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం వచ్చిన అనంతరం ఈ పెండింగ్ బిల్లులపై దృష్టి సారించింది. ఈక్రమంలో ఎఫ్‌టీవోలు అప్‌లోడై చెల్లింపునకు పూర్తిగా లైన్‌క్లియర్‌గా ఉన్న వాటిని గత జనవరి, ఫిబ్రవరిలో చెల్లించారు. ఆ సమయంలో జిల్లాలో రూ.11.30 కోట్లు పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరిగాయి.

కేంద్రం అనుమతితో నమోదు

రెండో కేటగిరీగా ఉన్న వాటి చెల్లింపులకు వైసీపీ నిర్వాకం వల్ల సాఫ్ట్‌వేర్‌లో ఆ పనులు తొలగించడంతో తిరిగి ఆ సాఫ్ట్‌వేర్‌ను పునరుద్ధరణ కోసం కేంద్రంతో రాష్ట్రప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. ఆ మేరకు ఇటీవల అనుమతి వచ్చింది. దీంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ వద్ద ఉన్న వివరాల ప్రకారం జాబితాలను జిల్లాలకు పంపించి వాటికి సంబంధించి రికార్డులను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వాటికి నగదు బదిలీ ఉత్తర్వులు (ఎఫ్‌టీవో)లను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆ ప్రకారం జిల్లాకు రూ.16.17 కోట్ల పనులకు సంబంధించిన వివరాలను పంపారు. వాటిపై జిల్లాలోని డ్వామా సిబ్బందితోపాటు అప్పట్లో పనులను పర్యవేక్షించిన ఆయా శాఖల అధికారులు కసరత్తు చేశారు. ఇప్పటివరకు రూ.10.24 కోట్ల పనులకు ఎఫ్‌టీవోలను అప్‌లోడ్ చేశారు.

ONGOLE MUNICIPAL CORPORATION

'E' Procurement Tender Notice

No.732 to 838/2025-26, Dt: 29-08-2025

			732 to 745/2025-26	746 to 838/2025-26
1	Number of Works	:	14	93
2	Total value of works	:	Rs.223.60 Lakhs	Rs.1947.73 Lakhs
3	Download Start Time	:	30-08-2025 @ 4.00 PM	02-09-2025 @ 4.00 PM
4	Download End Time	:	06-09-2025 @ 4.00 PM	16-09-2025 @ 4.00 PM

For Details : www.apeprocurement.gov.in, Ph : 98499 06599

Sd/- Executive Engineer, Ongole Municipal Corporation

తడిసి ముద్దయిన నగరం

● వర్షానికి పలు ప్రాంతాల్లో నిలిచిన నీరు



ఏకధాటిగా కురిసిన వానకు నగరం తడిసి ముద్దయింది. దాంతోపాటు నగరంలోని పలు కాలనీల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. శుక్రవారం రాత్రి 8గంటలకు మొదలై ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు ప్రజలకి పాట్లు తప్పలేదు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి, బురదమయంగా మారాయి. నగరంలోని ప్రధాన వీధులన్నీ వర్షపునీరు, మరోవైపు లోతట్టు ప్రాంతాల్లో చెరువులను తలపించాయి. పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కొప్పోలు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ఇరిగేషన్ కార్యాలయం, మినీ స్టేడియంలలో నీరు నిలిచి, చెరువులు తలపిస్తుండగా, శివారు కాలనీలైన వెంకటేశ్వర కాలనీ, బలరాం కాలనీ, బిలాల్ నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషువా కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని కర్నూలు రోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం, స్టేషన్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

-ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

రేషన్ షాపునకు వెళ్లి స్టాక్‌తోపాటు రిజిస్టర్‌ను చూశారు. 65ఏళ్లు పైబడిన వృద్ధులకు రేషన్‌ను జేసీ అందజేశారు. అనంతరం వెల్లంపల్లిలోని నందిని ట్రేడర్స్‌ను వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఎరువులు, పురుగుల మందుల స్టాక్ రికార్డులను చూశారు. దుకాణంలో ఎరువులు విక్రయించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. నకిలీ ఎరువులు, పురుగు మందులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదుకు చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. అనంతరం సినిమా థియేటర్‌కు వెళ్లి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఇలా జిల్లావ్యాప్తంగా ఆయాశాఖల అధికారులు పలు సంస్థలను పరిశీలించడమే కాకుండా రికార్డులను తనిఖీ చేశారు. ఏమైనా లోటుపాట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. రికార్డులు పక్కాగా ఉండాలని ఆదేశించారు.

నిమజ్జనంపై నిఘా

(5వ పేజీ తరువాయి)

డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో నిఘా చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం ఎస్పీ దామోదర్ కొత్తపట్నం తీరాన్ని సందర్శించారు. నిమజ్జనం జరిగే ఈ ప్రాంతంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. తీరం అంతటా ఆయన పర్యటించి వాహనాలను ఎక్కడి వరకు అనుమతించాలి, రోడ్డు నుంచి విగ్రహాలను ఏ ప్రాంతంలో సముద్రంలోనికి తీసుకుపోవాలనే విషయాలపై దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చిన్న పిల్లలు సముద్రంలోకి దిగకుండా చూడాలని కోరారు. నిర్దేశిత సమయాల్లో మాత్రమే నిమజ్జనానికి విగ్రహాలను అనుమతించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. భక్తులకు ఏదైనా ప్రమాదం జరిగే వెంటనే కాపాడేందుకు గజ ఈతగాళ్లను తీరంలో సిద్ధంగా ఉంచాలన్నారు. వాహనాల్లో డీజే సౌండ్స్‌ను అనుమతించవద్దన్నారు. అనంతరం ఎస్పీ దామోదర్ విలేకరుతో మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా జిల్లావ్యాప్తంగా కొత్తపట్నం తీరంతోపాటు ఇతర తీరాలు, చెరువులు, నదులు, కాలువల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ వెంట మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్, మెరైన్ ఎస్ఐ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

తీరంలో వైద్యశిబిరం

నిమజ్జనాల సందర్భంగా వైద్యారోగ్యశాఖ వారు కొత్తపట్నం తీరంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన మందులను సిద్ధంగా ఉంచారు. పీహెచ్‌సీ వైద్యులు ఒకరు, ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీలు, ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు ఆశ కార్యకర్తలతోపాటు వైద్యాధికారి పర్యవేక్షణ చేస్తున్నారు. శిబిరాన్ని శుక్రవారం కొత్తపట్నం వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జనాలు పూర్తయ్యేవరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని ఆమె తెలిపారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

(5వ పేజీ తరువాయి)

అన్ విల్లింగ్ లెటర్లు పంపారు. మరో ఇద్దరికి సకాలంలో బీఈడీ సర్టిఫికెట్లు రాకపోవడంతో వారిని అనర్హులుగా ప్రకటించారు. దీంతో మొదటిరోజు 568 మందిలో 563 మంది సర్టిఫికెట్లు మాత్రమే పరిశీలించారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకు పరిశీలన కొనసాగింది. రెండో రోజైన శుక్రవారం 89 మంది అభ్యర్థులను ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచారు. వీరిలో కొందరు హాజరుకాకపోవడంతో అధికారులు వారికి కూడా ఫోన్లు చేసి పిలిచారు సాయంత్రానికి మొత్తం 89మంది వచ్చారు. దీంతో రెండు రోజుల్లో కలిపి 652 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైనట్లు అయింది. కార్యక్రమాన్ని డీఆర్వో ఓబులేషు శుక్రవారం పరిశీలించారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు

దివ్యాంగుల కోటాలో మెరిట్ జోన్‌లో ఉన్న 20మంది అభ్యర్థులు గురు, శుక్రవారాల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. విద్యార్హతలపరంగా అన్నీ సక్రమంగా ఉన్న వీరికి మెడికల్ బోర్డు వైకల్యాన్ని ధ్రువీకరిస్తేనేఉద్యోగాలు ఇస్తారు. దీని కోసం వీరు మెడికల్ బోర్డు ముందు హాజరుకావాల్సి ఉంది. వీరిలో శారీరక వైకల్యం ఉన్నవారు నలుగురు, వినికిడిలోపం ఉన్నవారు 10 మంది, దృష్టిలోపం వారు ఆరుగురు ఉన్నారు. వీరిలో శారీరక వైకల్యం వారు, దృష్టిలోపం ఉన్నవారు ఒంగోలు రిమ్స్ సూపరింటెండెంట్, వినికిడి లోపం ఉన్నవారు విశాఖపట్నంలోని ఈఎన్‌టీ హాస్పిటల్ సూపరింటెండెంట్ ముందు హాజరై తమ సర్టిఫికెట్లకు ధ్రువీకరణ తీసుకురావాలని డీఈవో కిరణ్‌కుమార్ కోరారు. మొత్తంగా రెండు రోజుల్లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రశాంతంగా జరిగింది.

ఉపాధి అక్రమార్కులపై ఉదాసీనత

● పనుల్లో అవినీతిని తగ్గించిచూపే ప్రయత్నాలు ● ఆర్థిక నేరానికి పాల్పడినవారిని కాపాడుతున్న వైనం

దర్శి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలను నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారు. అక్రమాలను నీరుగార్చి అవినీతికి పాల్పడిన వారిని కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దర్శి మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై వారం క్రితం రెండు రోజుల పాటు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ జోసఫ్ కుమార్ ఆధ్వర్యంలో ఇది జరిగింది. మండలంలో 1,444 పనులను రూ.19,21,42,670తో చేశారు. వీటికి సంబంధించి సామాజిక తనిఖీ బృందం అనేక అక్రమాలను బయటపెట్టింది. మారెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, చందలూరు, వెంకట చలంపల్లి, పోతవరం తదితర గ్రామాల్లో కొంతమంది రైతులు మొక్కలు నాటకుండానే లక్షలాది రూపాయల బిల్లులు చెల్లించారని తనిఖీ సభ్యులు తెలిపారు. భీమవరం, పొతకమూరు, తూర్పువెంకటాపురం, జముకులదిన్నె, రాజంపల్లి తదితర గ్రామాల్లో పంటకాల్వల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని, తవ్విన దానికంటే అధిక మొత్తంలో బిల్లులు ఇచ్చారని నివేదిక ఇచ్చారు. కొన్ని గ్రామాల్లో కూలీలు పనులకు రాకుండానే మస్టర్లు వేశారని, కూలీల వేలిముద్రలు, సంతకాలు లేకుండానే డబ్బులు పంపిణీ చేశారన్నారు. కొన్నిచోట్ల పనులకు చెందిన బోర్డులు ఏర్పాటు చేయలేదని, కూలీలకు నీడ, మంచినీళ్ల ఏర్పాటు చేయలేదని తెలిపారు. ప్రజావేదికలో సామాజిక తనిఖీ సభ్యులు తమ విచారణలో తేలిన అక్రమాలను వివరంగా తెలిపారు.

రూ.10 లక్షల మేర అవినీతి

ఉపాధి జిల్లా అధికారులు అన్నిలెక్కలు తేల్చి ప్రాథమికంగా రూ.10 లక్షలు అవినీతి జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే, ఇక్కడే మతలబు చోటుచేసుకుంది. పండ్ల మొక్కలు పెంచకుండా డబ్బులు పంపిణీ చేసిన సొమ్మును రికవరీ జాబితాలో చేర్చలేదని తెలిసింది. ఎవరెవరికి ఎన్ని మొక్కలకు డబ్బులు ఇచ్చారో వారిచేత మళ్లీ మొక్కలు నాటించి పెంచేవిధంగా చూడాలని అధికారులు



దర్శిలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్ (ఫైల్)

చెప్పినట్లు సమాచారం. పంటకాల్వల తవ్వకాల్లో తగ్గిన కొలతలను పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది. కేవలం మస్టర్‌లలో తేడాలను, మరికొన్ని అంశాలను మాత్రమే పరిగిణలోకి తీసుకొని అవినీతి, అక్రమాలను తగ్గించి చూపించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా పలు గ్రామాల్లో పండ్ల మొక్కలు పెంచకుండా లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక గ్రామంలో ఏకంగా మొక్కలు పెంపకంలో రూ.25 లక్షలు అవినీతి జరిగిందని అధికారులకే పలువురు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు. ఈవిషయాలను పక్కనపెట్టి అక్రమాలను తగ్గించి సిబ్బందిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పనుల నిర్వహణలో అధికారులు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. దీంతో అవినీతి, అక్రమాలు అడ్డూ అదుపులేకుండా కొనసాగాయి. కొన్ని గ్రామాల్లో పనులకు కూలీలు ఒక్కరోజు కూడా రాకుండానే పూర్తిగా మస్టర్లు వేసి బిల్లులు మార్చుకున్నారు. అవినీతి సొమ్ము అందరూ పంచుకున్నారు. అప్పుడు జరిగిన ప్రజావేదికలో పెద్దగా చర్చ లేకుండానే నామమాత్రంగా నిర్వహించి ముగించారు. ఆసమయంలో జిల్లా అధికారులకు కూడా ఒక్కో పంచాయతీ నుంచి లక్ష రూపాయల చొప్పున ముడుపులు ఇచ్చారన్న ఆరోపణలు బాహాటంగానే వినిపించాయి. కొంతమంది అధికారులు, సిబ్బంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తమ తీరు మార్చుకోలేదని అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ చెడ్డపేరు తెస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పనుల నిర్వహణలో సుమారు మూడు నెలలు గత వైసీపీ ప్రభుత్వంలో నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేశారు. వారు గతంలో లాగానే ఈ ప్రభుత్వంలోనూ అడ్డగోలుగా వ్యవహరించారు. ప్రజావేదికలో ఏడాది కాలంలో చేసిన పనులకు సంబంధించి పాత, కొత్త ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ అవినీతి, అక్రమాలు ఎవరి హయాంలో జరిగాయనే విషయాన్ని తేల్చే విషయంపై అధికారులు దృష్టి సారించలేదు. దీంతో గతంలో ఏం చేసినా చెల్లుబాటు అయింది కదా ఇప్పుడుచేస్తే ఏం జరుగుతుందని కొంతమంది సిబ్బంది అదేతీరులో వ్యవహరించి అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి వాస్తవాలు నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





పార్వతీ తనయా.. పాహిమాం..!

వాడవాడలా గణేశునికి విశేష పూజలు

పార్వతీ తనయుడు, విఘ్నేశ్వరుడు విశేష పూజలు అందుకున్నాడు. వినాయక చవితి ఉత్సవాలు మూడవ రోజు శుక్రవారం వైభవం జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గణేశునికి భక్తులు పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూల్ రోడ్‌లోని గాయత్రి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద, నగరంలోని 38వ డివిజన్‌లోని సమతా నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పూజలు చేశారు. ఒంగోలు నగరం కాకతీయనగర్‌లో శుక్రవారం లక్ష కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని కమిటీ నిర్వాహకులు విగ్రహం వద్ద విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా 103 మంది మహిళలతో లక్ష కుంకుమార్చన చేశారు. గాంధీరోడ్‌లో హోమం నిర్వహించారు. స్థానిక 37వ డివిజన్‌లోని చెన్నకేశవ లే అవుట్ (ఎన్టీఆర్ పార్కు) వద్ద డివిజన్‌కు చెందిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. - ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



ఆశా నోడల్ ఆఫీసర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అమలు చేస్తున్న ఆరోగ్య జాతీయ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో ఆఫీసులో శుక్రవారం ఆశ నోడల్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా కిల్కారి కాల్ వల్ల ఉపయోగాలను వివరించారు. జిల్లాలో కిల్కారి కాల్ వచ్చినప్పుడు వినే గర్భిణులు, బాలింతల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. తద్వారా జిల్లాలో కిల్కారి రిసీవర్స్ సంఖ్య ఇంప్రూవ్ అవుతుందన్నారు. మాత శిశు మరణాలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఈ కిల్కారి కాల్ సర్వీసును ప్రవేశపెట్టిందన్నారు. గర్భిణీ నాల్గవ నెల మొదలుకొని బిడ్డ ఏడాది వరకు కిల్కారి కాల్స్ వస్తుంటాయన్నారు.

రైతుల అంగీకారంతోనే భూములను లీజుకు తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల అంగీకారంతోనే అభివృద్ధి పనులకు భూములను లీజుకు సేకరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శుక్రవారం పీఎంకేయూఎస్‌యూఎం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరేషన్ (ఎఫ్‌ఎల్‌ఎస్) కార్యక్రమం అమలుపై ఆయా శాఖల అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ పథకం కింద భూ కేటాయింపుల కోసం 121.75 సెంట్ల ప్రభుత్వ భూమి, 378 ఎకరాల పట్టాభూమిని గుర్తించామన్నారు. ఆ పట్టా భూముల రైతుల అంగీకారంతో ఆయా భూములను లీజు ఆధారంగా సేకరించి భూ కేటాయింపులు వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన ఇక్రిశాట్ బృందం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయంలోని పీఎండీఎస్, కాంపాక్ట్ బ్లాక్స్, ఏగ్రేడ్, ఏటీఎం మోడల్స్ వంటి ఉత్తమ నమూనాలను శుక్రవారం ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది సెమీ-ఆరిడ్‌ట్రాపిక్స్ (ఇక్రిశాట్), ది ఎనర్జీ అండరిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (టెరి) నిపుణులు శుక్రవారం జిల్లాలో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో ఈ పర్యటన జరిగింది. ఇక్రిశాట్ అనేది ఆసియా... ఆఫ్రికాలోని సెమీ-ఎరిడ్ ప్రాంతాల్లో ఆకలి, పేదరికం, పర్యావరణ క్షీణతను తగ్గించేందుకు డ్రైల్యాండ్ వ్యవసాయం, ఆహార వ్యవస్థలను మెరుగుపర్చడంపై దృష్టి సారించే అంతర్జాతీయ సంస్థ. టెరి అనేది స్వతంత్ర, లాభాపేక్షలేని పరిశోధన సంస్థ. ఇది ఎనర్జీ, పర్యావరణ, వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి రంగాల్లో వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేస్తుంది. పర్యటనలో భాగంగా నిపుణులు మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన రైతు సీహెచ్ రామాంజనేయులు రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న 20 రకాల పంటల వైవిధ్యతను పరిశీలించారు. అనంతరం చీమకుర్తి మండలం ఇలపావులూరు గ్రామానికి చెందిన పీ.రామాంజనేయులు అమలు చేస్తున్న ఏ-గ్రేడ్ మోడల్ కందిపంటను పరిశీలించారు. అనంతరం సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన సీహెచ్.మీనమ్మ 1.5 ఎకరాల్లో అమలు చేస్తున్న నిమ్మతోటను పరిశీలించారు. కొత్తపట్నం మండలానికి చెందిన రైతు పిట్టు వెంకటేశ్వరరెడ్డి ఒక ఎకరాలో అమలు చేస్తున్న ఏ గ్రేడ్ మోడల్ పొలాన్ని పరిశీలించారు. ఆయన వేరుశనగతో పాటు అంతర్ పంటలు సాగు చేస్తూ దానివల్ల కలిగే ప్రయోజనాలు, ఆదాయాలను నిపుణులకు వివరించారు. కొత్తపట్నంలో మల్లేశ్వరి నడుపుతున్న ప్రకృతివనరుల కేంద్రం (బయో రిసోర్స్ సెంటర్)ను సందర్శించారు. హెల్త్ అండ్ న్యూట్రిషన్ విభాగం గర్భిణులు, బాలింతల కోసం చూపుతున్న శ్రద్ధ, సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, ఇక్రిశాట్ బృందం లీడ్ డాక్టర్ హరి, సుధీని, టెర్రి బృందం ప్రతినిధులు డాక్టర్ హరిందు ఉన్నారు.



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న ఇక్రిశాట్, టెరి నిపుణులు



గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జేసీ, డీఆర్వో ఇతర అధికారులు

తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

● జేసీ గోపాలకృష్ణ పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మాతృభాష అయిన తెలుగు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. తెలుగు వాడక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురష్కరించుకొని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో రామమూర్తి చిత్రపటానికి డీఆర్వో చిన్న ఓబులేషుతో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లోనూ, ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ తెలుగు భాషకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాను సివిల్స్ పరీక్షలు సైతం తెలుగులోనే రాసిన విషయాన్ని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ప్రస్తావించారు.

సెలవులో డీపీవో

● ఇన్‌చార్జిగా వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి(డీపీవో)గా బీసీ కార్పొరేషన్ అధికారి వెంకటేశ్వరరావును నియమిస్తూ కలెక్టర్ తమీమ్‌అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు వ్యక్తిగత కారణాలతో ఈనెల 26 నుంచి వచ్చేనెల 9వతేదీ వరకు సెలవు పెట్టారు. దీంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇన్‌చార్జి డీపీవోనూ నియమించారు. గొట్టిపాటి వెంకటనాయుడు మళ్లీ విధుల్లో చేరేంత వరకు వెంకటేశ్వరరావు ఇన్‌చార్జి డీపీవోగా వ్యవహరించనున్నారు.

డీపీవో పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

జిల్లాపంచాయతీ అధికారి వెంకటనాయుడు పనితీరుపై కలెక్టర్ తమీమ్‌అన్సారియా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నాలుగు రోజులక్రితం గ్రీవెన్స్‌సెల్‌లో ఒక సమస్యపై డీపీవోపై అగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. మరోవైపు అదేరోజు సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా డీపీవో వ్యవహారశైలిపై మండిపడినట్లు సమాచారం. దీంతో జిల్లాపంచాయతీ అధికారి వెంకటనాయుడు 15 రోజులపాటు సెలవుపెట్టి వెళ్లాడనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల కాలంలో పంచాయతీలపై గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులు వస్తుండటం, ఆయా అంశాలపై తగిన విధంగా చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దీని కారణంగానే ఆయన సెలవులో వెళ్లాడనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

కార్మికులు 'ఈ-శ్రమ్'లో నమోదు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-శ్రమ్ పథకంలో సభ్యత్వం నమోదు చేసుకోవాలని గుంటూరు జోన్ సంయుక్తకార్మిక కమిషనర్ సీహెచ్ ఆషారాణి అన్నారు. స్థానిక ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో నమోద కావాలని, అందుకు అవసరమైన అవగాహనను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తమ శాఖల పరిధిలోని అసంఘటిత రంగ కార్మికులందరికీ సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రతతో పాటు ఆంగవైకల్యం కలిగినా లేదా ప్రమాదవశాత్తూ మరణించినా ఆ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక భద్రతను కల్పిస్తారన్నారు.


తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న రచయితల సమాఖ్య ప్రతినిధులు


బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఉప విద్యాధికారి


తూర్పునాయుడుపాలెం జడ్పీ హైస్కూల్లో..

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

● ఘనంగా మాతృబాషా దినోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం తెలుగు బాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో కర్నూలురోడ్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి కృషి ఫలితంగా తెలుగు భాష జీవం పోసుకుందన్నారు. కార్యక్రమంలో నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ, రచయితల సమాఖ్య ప్రతినిధులు తేళ్ళ అరుణ, నూనె అంకమ్మరావు, బైరెడ్డి అరుణ, నూకతోటి శరత్‌కుమార్, కుర్ర ప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, ఎన్.శ్రీనివాస్, ఉప గ్రంథపాలకురాలు సంపూర్ణ, రత్నం పాల్గొన్నారు.

- ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్సీగూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలు వద్ద గిడుగు రామ్మూర్తి, తెలుగుతల్లి విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో పొన్నూరి వేంకటశ్రీనివాసులు, సంతవేలూరి కోటేశ్వరరావు, కరవది సుబ్బారావు, బైరపనేని ఆదినారాయణ, పెళ్ళూరు వెంకటేశ్వర్లు, వై.సురేష్ పాల్గొన్నారు.

- ఎర్రన సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, ఆగస్త్యరాజు, శివసుబ్రమణ్యం, స్వర్ణ మల్లిఖార్జునరావు, అంగిరేకుల గురవయ్య పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

ఒంగోలు విద్య: స్థానిక మాంటిస్సోరి హైస్కూలులో శుక్రవారం మాతృబాష, క్రీడాదిన్సోవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కందుకూరి వీరేశలింగం పంతులు జీవిత చరిత్రను విద్యార్థులు బుర్రకథరూపంలో వివరించారు. తెలుగుతల్లిని కీర్తిస్తూ 8,9 తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శబరినాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాంటిస్సోరిలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు

- స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వబాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి తెలుగుభాష దినోత్సవం హెచ్‌ఎం జి.కృష్ణకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉప విద్యాధికారులు చంద్రమౌళీశ్వర్, ఎం.శ్రీనివాసరెడ్డి తెలుగభాష ఔన్నత్యాన్ని వివరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. స్టాఫ్ సెక్రటరీ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవాలను శుక్రవారం సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్, మైనంపాడు డైట్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చాంద్ చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాకీ పోటీలను నిర్వహించారు. మైనంపాడు డైట్ కళాశాలలో సాంస్కృతి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రమోద, డీవీఎల్.నరసింహారావు, డైట్ ప్రిన్సిపాల్ సోమా శ్రీనివాసరావు, జిల్లా అసోసియేషన్ హాకీ సెక్రటరీ సుందరరామిరెడ్డి, అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, డిప్యూటీ ఎంఈవో చంద్రమౌళీశ్వర్ పీడీ వనజ, పీఈటీ రవికుమార్ పాల్గొన్నారు.


సంతనూతలపాడు హైస్కూల్లో నివాళులర్పిస్తున్న టీచర్లు

మద్దిపాడులో..

మద్దిపాడు: గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని విశ్రాంతి ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు దేవరశెట్టి యల్లమంద పేర్కొన్నారు. మద్దిపాడు నటరాజ్ మండపంలో శుక్రవారం గిడుగు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నేలటూరి సత్యనారాయణ, గంటా కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, బడితల వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, కాకుమాని వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గిడుగు, ధ్యాన్‌చంద్‌కు నివాళులు

కొండపి: తెలుగు భాషా దినోత్సవం, అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కె.ఉప్పలపాడు జడ్పీస్కూల్‌లో తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎం సుసన్నకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.


కె.ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్‌లో..

ముప్పవరంలో...

ముప్పవరం జడ్పీస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి పంతులు, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎం బి.కోటిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రాంధికం నుంచి వ్యవహారికంలోకి తెలుగును తీసుకురావడానికి రామ్మూర్తి పంతులు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్‌వీ ప్రసాద్, ఆర్.శ్రీదేవి, కేయూఎన్‌బీ చారి, రాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, అనురాధ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తూర్పునాయుడుపాలెంలో..

టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని జడ్పీస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్‌వీ.సుధారాణి పాల్గొన్నారు. తెలుగు భాష, క్రీడల ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు బీవీఎస్ జ్యోతి, ఉపాధ్యాయులు కె.మాధురి, ఈ.నిర్మలాదేవి, ఎస్‌కే నాసర్‌వలి, సురేష్, రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుధారాణి విద్యార్థులకు రూ.10 వేల విలువైన క్రీడా పరికరాలను అందించారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి: తెలుగు బాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం దేవరపాలెం, చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నేకునంబాదు ప్రాథమిక పాఠశాలతో ఘనంగా జరిపారు. గిడుగు రామ్మూర్తిపంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యురాలిగా సునీత

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ జిల్లా కమిటీ సభ్యురాలిగా ఒంగోలుకు చెందిన పొన్నర్సు సునీత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి లభించడం పట్ల ఎమ్మెల్యే దామచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో దళిత, గిరిజను సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొన్నర్సు మురళీ, డివిజన్ అధ్యక్షుడు బాబూరావు, మైనార్టీ సెల్ కార్యదర్శి నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దామచర్ల నుంచి నియామకపత్రం అందుకుంటున్న సునీత

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలో పలు గ్రామాల ప్రజల నుంచి వచ్చిన పలువురు 25 వినతిపత్రాలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖా అధికారులతో మాట్లాడి త్వరంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని అర్జీదారులకు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

చీమకుర్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్ చదువుచున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చీమకుర్తి పట్టణ శివారునున్న ఓ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. ఒంగోలులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ వినాయకచవితి సెలవులు ఇవ్వటంతో ఇంటికి వచ్చిన ఆమె మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు ఒడిగట్టింది. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్బారావు పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఫాసిజాన్ని మట్టి కరిపించడమే కర్తవ్యం

● సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కార్యదర్శి జేమ్స్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఫాసిజాన్ని మట్టి కర్పించడమే ప్రజల తక్షణ కర్తవ్యమని సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కార్యదర్శి జేమ్స్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్‌లో జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన జేమ్స్ మాట్లాడుతూ ప్రపంచంలోనే వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఫాసిస్ట్ సంస్థ ఆర్ఎస్ఎస్ అని, దాని కనుసన్నల్లో నేడు దేశం అత్యంత ప్రమాదస్థితిలో ఉందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని, నయా ఉదారవాద విధానాలను తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల హక్కులను కాలరాస్తుందన్నారు. మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల భూములను కార్పొరేటర్లకు అప్పచెబుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లిపొర వెంకటేశ్వరరావు, రెబ్బవరపు ఉదయ్, రంగనాథం, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, దాసరి సుందరం, ఎం.జార్జి, సుబ్బారావు, పేరం సత్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేమ్స్

వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

జేసీ గోపాలకృష్ణ హెచ్చరిక ● విస్తృతంగా రేషన్‌దుకాణాలు, పెట్రోల్ బంకులు, ఆర్వో ప్లాంట్ల తనిఖీలు చేపట్టిన అధికార యంత్రాంగం

మద్దిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులను సక్రమంగా నిర్వహించని డీలర్లపై చర్యలు తప్పవని జేసీ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మద్దిపాడులోని రేషన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రేషన్‌షాపుల ద్వారా నిర్వాహకులు నిత్యావసర సరుకులు బాధ్యతగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్, డీలర్ చుంచు హరిబాబు కళ్యాణి పాల్గొన్నారు. అనంతరం ఎరువుల దుకాణాలను, పెట్రోలు బంకులను తనిఖీ చేశారు.

- జరుగుమల్లి (కొండపి): మండలంలోని పలు రేషన్ షాపులను తహసీల్దార్ పి.మురళి శుక్రవారం తనిఖీ చేశారు. చిర్రికూరపాడులోని పెట్రోల్ బంకును, ఐటీసీ ఆర్వో ప్లాంటును పరిశీలించారు. వినియోగదారులను మోసం చేసి, అధిక ధరలకు అమ్మినా.. కల్తీ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈసందర్భంగా నిర్వాహకులను ఆయన హెచ్చరించారు.

- పొన్నలూరు: పొన్నలూరులోని ఎరువుల దుకాణాలను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న నిల్వలు, ధరల వివరాలను పరిశీలించారు. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లోని ఎరువులకు సరైన పత్రాలు లేనందున రూ.55,000 విలువైన నిల్వను, వేణుగోపాల్ ఫెర్టిలైజర్స్‌లో స్టాకును ఈ పాస్‌బుక్‌లో నమోదు చేయనందున రూ.2,27,571 విలువైన సరుకు అమ్మకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఏవో వి.రాము తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా స్టాక్ బోర్డులో ఎప్పటికప్పుడు నిల్వలను చూపించాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెట్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో తహసీల్దార్ వీఎస్.పాల్, కానిస్టేబుల్ కృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.


మద్దిపాడులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ


నాగులుప్పలపాడులో పెట్రోల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

- నాగులుప్పలపాడు: పెట్రోలు బంక్‌లు, వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం నాగులుప్పలపాడులోని పెట్రోలు బంక్, మద్దిరాలపాడులోని వాటర్‌ప్లాంట్‌ను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సదరు పెట్రోలుబంక్‌లో స్టాక్‌బోర్డు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి సౌకర్యం, తాగునీరు, ఇంధనం కొలతలు, నాణ్యతను పరిశీలించారు. వాటర్ ప్లాంట్‌లో నీటి నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఉప్పుగుండూరులోని మనగ్రోమోర్‌ను ఎరువుల దుకాణాన్ని ఏవో వెంకట్రావుతో కలసి తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో సుబ్బరామయ్య పాల్గొన్నారు.

- సంతనూతలపాడు: మండలంలో శుక్రవారం తహసీల్దార్ నారాయణరెడ్డి పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లను, రేషన్‌షాపులను తనిఖీ చేశారు. గ్యాస్ ఏజెంట్లు, రేషన్ డీలర్లు, పెట్రోల్ బంకుల వద్ద ఎక్కడైన సరే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతనూతలపాడులో ఎరువుల షాపులను ఏవో పావని తనిఖీ చేశారు.

ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం


క్విస్ కళాశాలలో వాలీబాల్ మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు


కారుమూడివారిపాలెం హైస్కూలులో విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ పోటీలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కళాశాల యాజమాన్యం ప్రోత్సాహక బహుమతులను అందజేసింది. ఈ సందర్భంగా క్రీడాకారులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒలంపిక్ క్రీడల్లో బంగారు పతకం సాధనలో ధ్యాన్‌చంద్ కృషిని కొనియాడారు. కళాశాల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో చదువుతో పాటు విద్యార్థులను క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఫిజికల్ డైరెక్టర్ విభాగాధిపతి నందిని పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మద్దిపాడు: మండలంంలోని కారుమూడివారిపాలెం జడ్పీ హైస్కూలులో శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో ప్రతిభకనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మండవ ప్రభాకర్, చైర్మన్ రవికుమార్, క్రీడా సామగ్రి దాతలు సంజీవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, పీఈటీలు మాధవిలత, పి.విజయకుమార్ పాల్గొన్నారు.

బీడు భూముల ఆక్రమణకు యత్నం

వెలిగండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లిలో పశువుల బీడు భూములను ఆక్రమణకు యత్నించారు. రైతులు అడ్డుకొని శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెం.104-2లో 30 ఎకరాలను కొంతమంది గ్రామస్థులు, బయటవ్యక్తులు యంత్రాల సహాయంతో చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. పూర్వం నుంచి రెవెన్యూ రికార్డుల్లో పశువుల బీడు భూమిగా నమోదై ఉందని గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణదారులు దొంగ పట్టాలు సృష్టించి కాజేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. రూ.60 లక్షలు విలువచేసే 30 ఎకరాలకు పైగా ఆక్రమిస్తున్నారని తహసీల్దార్‌కు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


బీడు భూమిని పరిశీలిస్తున్న రైతులు

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు, స్థానికులు

కొండపి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై మద్యం మత్తులో ఉన్న యవకులు దాడి చేయడంతో అయనకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. డ్రైవర్ బొమ్మిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి కొండపి నుంచి ఒంగోలుకు బస్సును తీసుకొని ప్రయాణికులతో వెళ్తుండగా, వెన్నూరు వద్ద ఒంగోలుకు చెందిన కుంచాల శ్రీనివాసులు, అతని స్నేహితుడు కలిసి మద్యం తాగి రోడ్డుపై అడ్డంగా తమ ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉన్నారు. వాహనాన్ని పక్కకు తీయాలని డ్రైవర్ కోరగా ఆగ్రహించిన యువకులు అతడిని బస్సు నుంచి లాగి కింద పడేశారు. అనంతరం దాడి చేశారు. దీంతో బస్సులోని మహిళలు, వెన్నూరు గ్రామంలోని కొందరు వ్యక్తులు నిందితులకు దేహశుద్ధి చేసి కొండపి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను కొండపి వైద్యశాలకు, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన ఫెడరేషన్ జిల్లా మహాసభలో నూతన అధ్యక్షుడిగా కె.సుబ్బరాయుడు(మార్కాపురం) ప్రధానకార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఒంగోలు), సభ్యులుగా కె.సామ్రాజ్యం, ఇట్లా నాగయ్య, చీమకుర్తి ఏడుకొండలు, టి.విజయమ్మ, బి.కోటేశ్వరరావు, సీహెచ్.ప్రసాద్, పి.పద్మ, బి.భారతిలను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభలో చేసిన తీర్మానాలను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. మునిసిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, గత సమ్మె కాలపు వేతన జీవోను ఇవ్వాలని, కొవిడ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

రైతుల అంగీకారంతోనే భూములను లీజుకు తీసుకోవాలి : జేసీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల అంగీకారంతోనే అభివృద్ధి పనులకు భూములను లీజుకు సేకరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శుక్రవారం పీఎంకేయూఎస్‌యూఎం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరేషన్(ఎఫ్ఎల్ఎస్) కార్యక్రమం అమలుపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. ఈ పథకం కింద భూ కేటాయింపుల కోసం 121.75 ఎకరాల ప్రభుత్వ భూమి, 378 ఎకరాల పట్టాభూమిని గుర్తించామన్నారు. పట్టా భూముల రైతుల అంగీకారంతో ఆయా భూములను లీజు ఆధారంగా సేకరించి భూ కేటాయింపులు వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, మార్కాపురం సబ్‌కలెక్టర్‌తో పాటు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగోలు, కనిగిరి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీసరస్వతి' అధినేతకు సత్కారం

ఒంగోలు విద్యఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలో గదులు కేటాయించి అన్ని వసతులు సమకూర్చిన కళాశాల చైర్మన్ ఏవీ.రమణారెడ్డిని శుక్రవారం డీఈవో కిరణ్‌కుమార్ సన్మానించారు. కళాశాలలో షామియానాలు, కుర్చీలు, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు రెండు రోజుల పాటు అధికారులు, సిబ్బంది, డీఎస్సీ అభ్యర్థులకు భోజనం, టిఫిన్, టీ, స్నాక్స్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో వసతుల పట్ల రాష్ట్ర పరిశీలకులు కూడా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కిషోర్ బాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

ఒంగోలు క్రైం, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు మండలం యర్రజర్ల కొండలలో పేకాడుతున్న ఏడుగురిని ఎస్పీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి రూ.2,03,670 నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని ఒంగోలులోని పాత తాలుకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ వారిని ఎస్పీ దామోదర్ విచారించి వెళ్లారు.

అంగన్‌వాడీలతో సమీక్ష

కొండపి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జరుగుతున్న సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం పీడీ ఎస్.సువర్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడారు. 12 రికార్డుల్లో నమోదు చేయాల్సిన అంశాల గురించి ప్రశ్నించి సమాధానాలను తెలుసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో సుశీలాదేవి, సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ సువర్ణ

సకాలంలో రుణాలను చెల్లించాలి

సంతనూతలపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడు వెలుగు కార్యాలయంలో డ్వాక్రాగ్రూపు సంఘాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వీవోఏలు గ్రామాల్లో ప్రజలు ఇంటిముందు ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా విధులను నిర్వర్తించాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో రవికుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న వివిధ సర్వేలను సకాలంలో ప్రభుత్వ సూచనల అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. బంగారు బాల్యం యాప్‌లో బాలల పూర్తి వివరాలను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. గృహనిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను నాటిన జనసేన నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరులోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకలు శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్ పెంట్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరావు, అనిల్, అరుణ్, సాయి, శ్రీను, సుభాష్, మల్లెపూల గోపి, మాదాసు సుభాష్, వంశీ పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న నాయకులు

అక్షరాస్యతను పెంచటమే ఉల్లాస్ లక్ష్యం

కొత్తపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దిటమే లక్ష్యంగా ప్రభుత్వం ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని వయోజన విద్య అధికారి టి.పోతురాజు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపట్నంలో వీవోఏలు, వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లులకు ఒక రోజు శిక్షణ శిబిరం ఏపీఎం విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ నిరక్షరాస్యులుగా ఉన్న 15-59 సంవత్సరాల వయసు వారిని గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వలంటీర్ టీచర్‌కు పదో తరగతి విద్యార్హత ఉండాలన్నారు. ఒక్కో వలంటీరు పది స్వయం సహాయక సంఘాలు, స్త్రీశక్తి సంఘాల సభ్యులను అక్షరాస్యత వైపు నడిపించాలని చెప్పారు. జిల్లాలోని 1,29,497 మందిని అక్షరాస్యులుగా తీర్చిలా చర్యలు చేపట్టానట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీవో నాగరాజు, సీసీలు ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోతురాజు

అవీ..ఇవీ



యడవల్లి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

సమయపాలన పాటించకపోతే చర్యలు

రాచర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో ఎస్. వెంకట రామిరెడ్డి అన్నారు. మండలంలోని యడవల్లి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి నిర్ణీత సమయానికి ఎంతమంది హాజరయ్యారనే విషయాన్ని తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఖచ్చితంగా చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. అంకిరెడ్డిపల్లెలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేసక్రమంగా నిర్వహించాలని, తప్పులు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి గ్రామాల్లోని సమస్యలు, వాటి స్థితిగతులపై అధికారులతో చర్చించారు. మండల స్థాయి అధికారులతోపాటు కింది స్థాయి అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ ఐ. వెంకటేష్, అధికారులు, సచివాలయ, స్వామిత్వ సర్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గంటవానిపల్లె చప్టా వద్ద తీగలేరు వాగుపై తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసుకుంటున్న ప్రజలు

తీగలేరు వాగుపై తాత్కాలిక రోడ్డు

పెద్దదోర్నాల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంటవానిపల్లె గ్రామం వద్ద తీగలేరు వాగుపై గ్రామ ప్రజలు తాత్కాలిక కట్టడాన్ని శుక్రవారం ఏర్పాటు చేసుకున్నారు. రెండునెలల్లో మూడుసార్లు తీగలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో గ్రామానికి బయటి ప్రదేశాలకు కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచి పోయాయి. తద్వారా విద్యార్థులు సమయానికి పాఠశాలలకు,ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లలేక పోయారు. రైతులు పంట ఉత్పత్తులు, పొలాలకు ఎరువులు తదితరాలు తరలించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఈ బ్రిడ్జి నిర్మాణంలో ఎటువంటి మార్పు లేదు. ప్రభుత్వం స్పందించినా ఇప్పటికిప్పుడు తీరే సమస్య కాదని భావించిన గ్రామ ప్రజలు సొంత నిధులు సేకరించి తాత్కాలికంగా రాతి కట్టడాన్ని ఏర్పాటు చేసుకున్నారు.



దరగా గ్రామంలో మద్దతు ధర చెల్లించాలని నినాదాలు చేస్తున్న నేతలు

పత్తికి మద్దతు ధర చెల్లించాలి

● గ్రామ సభలో రైతు సంఘం నాయకుల డిమాండ్

బేస్తవారపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు సరైన మద్దతు ధర లేకపోవడంతో నష్టాలపాలై అప్పుల్లో కూరుకుపోతున్నారని, వెంటనే పత్తి రైతులకు సరైన మద్దతు ధర క్వింటాకు రూ.10.075 చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి అన్నారు. శుక్రవారం బేస్తవారపేట మండలంలో పలు గ్రామాలతో పాటు దరగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పత్తి దిగుమతి సుంక తగ్గింపు జీవోను ఉపసంహరించు కోవాలని గ్రామ సభలో తీర్మానం చేసి ప్రధాన మంత్రికి పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు డాకాల పుల్లయ్య, సీపీఐ నాయకులు జోసఫ్, ఆర్.యోగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కిరణ్

కంభంలో ఎరువుల షాపుల తనిఖీ

కంభం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణంలోని ఎరువుల షాపులను తహసీల్దార్ కిరణ్, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్‌లు శుక్రవారం తనిఖీ చేశారు. పట్టణంలోని విగ్నేశ్వర ట్రేడర్స్ విజేత ట్రేడర్స్ షాపుల్లోని ఎరువుల వివరాలను పరిశీలించారు. యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా నిల్వలు షాపులో అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించినా లేదా అధిక ధరలకు అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలలో ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు.

నేడు మున్సిపల్ సమావేశం

గిద్దలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని తమ కార్యాలయంలో 30వ తేదీ శనివారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మున్సిపాలిటీలోని అన్ని విభాగాల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అంగరంగ వైభవంగా గణనాథుల నిమజ్జనం

మేళతాళాలతో ఘనంగా వీడ్కోలు

స్వామి లడ్డూకు వేలంలో భలే గిరాకీ



గిద్దలూరు పూసలబజారులో లక్ష్మీ గణేశుడి వద్ద భక్తులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు చేసిన భక్తులు శుక్రవారం సాయంత్రం బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికారు. స్వామి వారిని అలంకరించిన ట్రాక్టర్లు, మిని లారీలలో నిమజ్జనానికి తరలించారు. మేళతాళాలతో భక్తులు స్వామి వారిని పట్టణ శివార్లలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వేలంలో స్వామి లడ్డూకు డిమాండ్ పెరిగింది. పట్టణంలోని కొంగళవీడు రోడ్డు, పూసలబజారులో బాలగణపతి 16వ వేడుకల్లో వేలం నిర్వహించగా రూ.1.20లక్షలు పలికింది. సారె రాయుడు లడ్డూను కైవసం



నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు

చేసుకున్నాడు. అలాగే పట్టణంలోని షరాఫ్‌బజారు స్వర్ణగణపతి లడ్డూను డీఏ జ్యూవెలర్స్ యజమాని దస్తగిరి రూ.90వేలకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీలోని సింగంపల్లి గ్రామంలో రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉన్న లడ్డూను బొర్రా ఈశ్వరయ్య రూ. 46వేలకు కైవసం చేసుకున్నాడు. పాములపల్లె గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక విగ్రహం వద్ద గ్రామానికి చెందిన కాశయ్య, సత్యవతి దంపతులు రూ. 35వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో గల పుల్లయ్య కాంప్లెక్స్‌లో సయ్యద్ మునాఫ్ అనే ముస్లిం యువకుడు 33,616 రూపాయలకు లడ్డూను సొంతం చేసుకుని మతసామరస్యానికి చిహ్నంగా నిలిచారు.

పెద్దదోర్నాలలో

పెద్ద దోర్నాల :మండలంలో వినాయకచవితి సందర్భంగా శుక్రవారం నిమజ్జన వేడుకలను నిర్వహించారు. స్థానికంగా పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథులు, అలాగే తిమ్మాపురం శ్రీచౌడేశ్వరీ దేవి ఆలయం, ఐనముక్కల గణపతి దేవాలయం తదితం ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో అన్నదానం నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని బాణసంచా కాలుస్తూ బోలో గణేశ్ మహారాజ్ కీ జై అంటూ కేరింతలతో నృత్యాలు చేస్తూ శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర జలాశయాలకు తరలివెళ్లారు.

ఘనంగా వినాయక విగ్రహం నిమజ్జనం

తర్లుపాడు : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మూడో రోజు నిమజ్జనం చేశారు. కలుజువ్వలపాడు, ఓబాయపల్లి, తుమ్మలచెరువు, తర్లుపాడులో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ట్రాక్టర్‌లపై పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బొడిచర్ల గుండ్లకమ్మ వాగులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రూ.30వేలు పలికిన వినాయకుడి లడ్డు

రాచర్ల : మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం నిర్వహించిన వేలంలో మండలంలోని ఓబుల రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎనుముల నారాయణ రెడ్డి అనే భక్తుడు రూ.30వేలకు వినాయకుడి లడ్డును దక్కించుకున్నారు.



తర్లుపాడులో వినాయక విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పెట్రోల్ బంకుల్లో తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలి

తహసీల్దార్ మంజునాథరెడ్డి



ఎర్రగొండపాలెంలోని పుల్లలచెరువు రోడ్‌లో హెచ్‌పీ ఫిల్లింగ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దారు మంజునాథరెడ్డి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పెట్రోలు, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్‌లకు వచ్చే వినియోగదారులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, టాయిలెట్లు సౌకర్యం కల్పించాలని ఎర్రగొండపాలెం తహసీల్దారు మంజునాథరెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం పుల్లలచెరువు రోడ్ లో హెచ్‌పీ పెట్రోల్, డీజిల్ బంక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోలు పంప్‌లో సాంద్రత సక్రమంగా ఉందా లేదా అని పంపుఆన్‌లో ఉంచి పరిశీలించారు. తాగటానికి నీటి బబుల్ ఏర్పాటుచేసి పరిశుభ్రమైన నీటిని వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. టాయిలెట్సు గదులకు తాళాలు ఎందుకు వేశారని, టాయిలెట్సు తలుపులు తెరచి, పరిశుభ్రంగా ఉంచాలని, గాలి మిషన్ రన్నింగ్‌లో ఉంచాలని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు చేస్తామని అక్కడే ఉన్న పెట్రోల్ బంకు యజమాని సుబ్రమణ్యం తెలిపారు.

చౌకదుకాణాల తనిఖీ

ఎర్రగొండపాలెంలోని 4 ,6,11వ నెంబరు చౌకదుకాణాలను శుక్రవారం సాయంత్రం తహసీల్దారు మంజునాథరెడ్డి తనిఖీ చేశారు. 6 వ నెంబరు చౌకదుకాణంలో కార్డుఉన్న మహిళకు వేలిముద్రలు వేయించి బియ్యం పంపిణీ చేయించారు. తూకాలు పరిశీలించారు. షాపు బయట గోడకు చౌకదుకాణం అడ్రసు ఉన్న బోర్డు ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశారు. వృద్ధుల ఇళ్లకు తీసుకువెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రాచర్ల : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మండల తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన రాచర్ల పెట్రోల్ బంక్, రాచర్ల 14వ చౌకధరల దుకాణాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ నిబంధనల ప్రకారం నడుపుతున్నారా ? లేదా ? కస్టమర్స్‌కి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారా ? లేదా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో తేడాలు ఉన్నా, కస్టమర్లకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వసతులు కల్పించకపోయినా, ప్రజల నుండి ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకుంటామని అన్నారు. రేషన్ షాపు దుకాణాలు కూడా నిబంధనల ప్రకారం నిర్వహించాలని ప్రతి కార్డు దారుడికి రేషన్ అందించాలని అన్నారు. డీలర్లు అందుబాటులో ఉండి రేషన్ అందించాలన్నారు. రేషన్ డెలివరీలో పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని అన్నారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మహనీయుల జీవితాలు ఆదర్శనీయం

ఘనంగా క్రీడా, తెలుగుభాషా దినోత్సవాలు



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

పెద్ద దోర్నాల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు భాషకు కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు జీవితాలు ఆదర్శనీయమని ప్రధానోపాధ్యాయురాలు శ్యామ్ ప్రసన్నతాంజలి పేర్కొన్నారు.స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది, కళాశాలలో అధ్యాపక సిబ్బంది ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, రామానాయక్, విజయమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ఫిలిప్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో..

ఎర్రగొండపాలెం : తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం జడ్పీ ఉన్నతపాఠశాలలో నిర్వహిం చారు. తెలుగు భాషా ఉద్యమకారుడు గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. .తెలుగు తల్లి, సరస్వతిదేవి,గిడుగు వెంకటరామమూర్తి వేషధారణతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలుగుభాషపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఎంఈవో ఆంజనేయులు పంపిణీ చేశారు.

తర్లుపాడులో..

తర్లుపాడు : వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని, నవోదయ విద్యాలయంలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు భారత హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ పుట్టిన సందర్భంగా ఆయన క్రీడా ప్రయాణాన్ని ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి వివరించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నవోదయ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మార్కాపురం డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ నాసరయ్య, వైస్ ప్రిన్సిపల్ ఎస్.శ్రీధర్, ప్రధానోపాధ్యాయుడు ఎస్కే మౌలాలి, కశ్శెట్టి జగన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. వాసవి విద్యానికేతన్‌లో తెలుగు భాషా, క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ రంగయ్య ఆధ్వర్యంలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులు తెలుగు అక్షరాల రూపకం ధరించారు. తెలుగు తల్లి వేషధారణలో ఆకట్టుకున్నారు.

గిద్దలూరులో

గిద్దలూరు :స్థానిక విశ్వభారతి పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు తల్లి వేషధారణలతో, వివిధ అంశాలపై చేసిన నృత్యాలు, పోటీలు అందరినీ అలరించాయి. సూర్య విద్యానికేతన్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో పాఠశాలల కరస్పాండెంట్లు బండారు ఆదిలక్ష్మి, బ్రహ్మానందరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కంభంలో

కంభం కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాషకు గొడుగు పట్టి వెలుగులద్దిన గిడుగు వెంకట రామ్మూర్తి ,హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్‌ల జన్మదినం సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి సంబరాలు జరుపుకున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కంభం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కంభం రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం మార్కాపురం మండలం దరిమడుగు గ్రామానికి చెందిన గుమ్మా సుబ్బారావు (45) కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహానికి సమీపంలో సుబ్బారావు ద్విచక్రవాహనాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

వార్డుల పరిశీలన

గిద్దలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డులలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు పర్యటించారు. ఏబీఎం పాలెం, నారాయణ స్కూల్ ప్రాంతాలను కమిషనర్ రమణబాబు పరిశీలించారు. అక్కడ కొన్ని వీధులు మురికిగా ఉండడాన్ని గమనించి పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల రోడ్లపైనే పశువులను కట్టివేయడం చూసి పశువులను తమ సొంత స్థలాలలో కట్టివేసుకోవాలని, రోడ్లపైన అపరిశుభ్రమైన పరిస్థితులు ఏర్పరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్తను ఇళ్ల వద్దకు వచ్చే చెత్తరిక్షాలలో వేయాలని తెలిపారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

తర్లుపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ(హైదరాబాద్) వారి సహకారంతో కొనుగోలు చేసిన విద్యాకిట్లను ప్రధానోపాధ్యాయుడు ఎస్.సుధాకర్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిగ్ హెల్ప్ సంస్థ చేస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గోసు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ప్రదీప్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై హర్షం

గిద్దలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే 15 ఏళ్లపాటు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కొనసాగుతుందని ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపట్ల బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడిగా ప్రయత్నం చేశారని, ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాయని పేర్కొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్

ఖైదీలు మంచి ప్రవర్తనతో జీవించాలి

● జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత పద్ధతి మార్చుకుని మంచి ప్రవర్తనతో జీవించాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. శుక్రవారం గిద్దలూరు పట్టణంలోని సబ్‌జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జైలును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సబ్ జైలులో ఉన్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకుని వారితో మాట్లాడి వారికి సూచనలు చేశారు. ఒక వ్యక్తి జైలు జీవితం గడుపుతున్న కారణంగా ఆ కుటుంబసభ్యులు ఎంతో బాధకు గురవుతారని, వారిని దృష్టిలో పెట్టుకుని ఇకమీదట జాగ్రత్తగా ఉండాలని వారికి తెలిపారు. సబ్ జైలులోని సౌకర్యాలు, అందుతున్న వైద్య సదుపాయాల గురించి, ఆహార పదార్థాల నాణ్యత, స్టోర్‌రూంను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, ప్యానల్ న్యాయవాదులు పిచ్చయ్య, రైడర్‌బాబు, పారాలీగల్ వలంటీర్ మధుసూదన్‌రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో పులి

● దరగా నుంచి బేస్తవారపేట వరకు తిరిగినట్లు పాదముద్రలు

● భయాందోళనలో ప్రజలు



బేస్తవారపేటలో పులి పాదముద్రలు

బేస్తవారపేట,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పెద్ద పులి మాట వింటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బేస్తవారపేట పట్టణానికి కిలో మీటరు దూరంలోని పంట పొలాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామాల్లోని ప్రజలకు తెలియడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం దరగ కొండ సమీపంలోని పొలాల్లో నుంచి బేస్తవారపేట జంక్షన్‌కు అతి సమీపం వరకు వచ్చి అక్కడ మొక్కజొన్న తోటల్లోకి వెళ్లినట్లు పులి పాదముద్రలు ద్వారా తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు రెండు రోజులుగా రాత్రి, పగలు సమీప పంట పొలాలు,సమీప కొండ ప్రాంతాలను పరిశీలించారు.శుక్రవారం మూడు బృందాలుగా ఆ ప్రాంతాలను పరిశీలించగా బేస్తవారపేటతో పాటు పూసలపాడు, దరగ కొండ ప్రాంతంలో పులి పాదముద్రలు సేకరించారు.అక్కడక్కడా సెట్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పులి ఆచూకీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దపులి తిరుగుతుందన్న సమాచారంతో ప్రజలు, గొర్రెల కాపరులు పంట పొలాలకు, వెళ్లడానికి భయపడుతున్నారు.

మేడపిలో అరుదైన పాము



క్యాచర్ చేతికి చిక్కిన అరుదైన పాము

త్రిపురాంతకం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణాసియా దేశంలో కనిపించే అరుదైన పాము త్రిపురాంతకం మండలం మేడపిలో గురువారం రాత్రి ప్రత్యక్షమైంది. మేడపి గిరిజన కాలనీలోని చరణ్ అనే వ్యక్తి ఇంటిలో ఈ పాము కనిపించింది. వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇచ్చారు. స్నేక్ క్యాచర్ మల్లికార్జున అక్కడకు చేరుకుని దానిని పట్టుకున్నారు. ఇది దక్షిణాసియా ప్రాంతంలో సంచరించే అరుదైన బాండెడ్ కుక్రి అనే పాము అని, ఇది విషరహిత కొలుబ్రిడ్ జాతికి చెందిన పాముగా మల్లికార్జున తెలిపారు. దీనిని అడవిలో వదిలివేస్తున్నామని తెలిపారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

కార్మికుల పక్షాన ప్రజా ప్రభుత్వం

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కార్మిక సంఘాల నాయకులు ఆయన కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆవులయ్య, నరసింహులు, నారాయణ, ఆబేలు, థామస్, భాస్కర్, రాంబాబు, వెంకటేశ్వర్లు కలిసి గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిలుపుదల చేస్తూ జీవో తీసుకురావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు ఆగిపోయాయని, ఆ జీవోను రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనితో స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కార్మికుల పక్షాన ప్రభుత్వం నిలుస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. కార్మికులు చెప్పిన విషయాలను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి చొరవ చూపుతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

గిద్దలూరులో రైతుబజారు ఏర్పాటుకు చర్యలు

గిద్దలూరు పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఒంగోలు సహాయ మార్కెటింగ్ సంచాలకులు వరలక్ష్మి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కలిశారు. పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు సంబంధించి స్థలసేకరణ విషయమై వారు చర్చించారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌కమిటీ ఛైర్మన్ బైలడుగు బాలయ్య, గిద్దలూరు, మార్కాపురం, కంభం మార్కెట్ కమిటీల కార్యదర్శులు రామకృష్ణ, సుజాత, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు ఎదుర్కొనే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈనెల 30వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డిపో మేనేజర్ షేక్ మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. 9959225702 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలిపితే వాటిని పరిష్కరించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలు పడుతుందని పేర్కొన్నారు.

నేడు వసతి గృహం ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శీలంవారిపల్లె గ్రామంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ప్లస్ కళాశాల ఆవరణలో సుమారు రూ.2 కోట్లతో కేజీబీవీ టైపు - 4 వసతిగృహాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభిస్తారు. అలాగే, సీఎస్‌పురంలోని కేజీబీవీ ఆవరణలో ఇంటర్ విద్యార్థినుల కోసం రూ.1.25 కోట్ల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను కూడా ప్రారంభించనున్నారు. శీలంవారిపల్లె గ్రామంలో 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన బాలికల వసతి గృహం నిర్మాణ పనులు పూర్తయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతో ప్రారంభానికి నోచుకోకపోవడంతో బాలికలు ఆరేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రారంభానికి చర్యలు తీసుకోవడంతో విద్యార్థినులకు అవస్థలు తీరనున్నాయి.

రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలి

ముండ్లమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పసుపుగల్లులోని సాయిశ్రీనివాస ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, ఉల్లగల్లులో పెట్రోల్ బంకును పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే సరఫరా చేయాలన్నారు. అనంతరం వేములబండలో రేషన్ షాపును పరిశీలించారు. ముండ్లమూరులో రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు గురవయ్య, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వీవోఏలపై ఉందని వయోజనవిద్య సూపర్‌వైజర్ రామన వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సీఎస్‌పురంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఏపీఎం ఎం.లక్ష్మీనారాయణ, సీసీలు ఐ.మస్తాన్‌రెడ్డి, టి.కావయ్య, ఎం.నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

దొనకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సీపీఎం మండల కన్వీనర్ చిరుపల్లి అంజయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం దొనకొండలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. కార్యక్రమంలో కుందుర్తి చిన్ననర్సింహులు, సంతోష్‌కుమార్, ఎర్రగుంట్ల ప్రభాకర్, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు, ధ్యాన్‌చంద్ జయంతి

పామూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా ఉద్యమకారుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు భారతరత్న ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను స్థానిక 5వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.రవి, ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వరరావు, పద్మావతి, తోట రమేష్ పాల్గొన్నారు.
తాళ్లూరు: తూర్పుగంగవరం జడ్పీ హైస్కూల్‌లో జాతీయ క్రీడ, తెలుగుభాషా దినోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వైఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

దొనకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని టీడీపీ లీగల్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. చంద్రన్న పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో శుక్రవారం విద్యార్థులకు, గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ చేయూతనందించాలన్నారు. గ్రామాలు పచ్చదనంతో నిండేలా సహకరించాలని కోరారు.

మారిన రూపురేఖలు

- రూ.3 కోట్లతో చింతలపూడి - ఉమామహేశ్వర అగ్రహారం తారురోడ్డు నిర్మాణం
- పది గ్రామాల ప్రజలకు తీరిన ఇబ్బందులు


రూపురేఖలు మారిన చింతలపూడి - ఉమా మహేశ్వర అగ్రహారం రోడ్డు

ముండ్లమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి - ఉమామహేశ్వర అగ్రహారం రహదారి రూపురేఖలు మారాయి. రూ.3 కోట్ల నిధులతో 3.2 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం చేశారు. దీంతో పది గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తీరాయి. ఎన్నోసంవత్సరాల నుంచి సరైన రహదారి లేక ఉమామహేశ్వర అగ్రహారం, వేములబండ, చింతలపూడి గ్రామాల ప్రజలతో పాటు పూరిమెట్ల, భీమవరం, పసుపుగల్లు, పెదఉల్లగల్లు గ్రామాల వాహన చోదకులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. 2023లో గత వైసీపీ ప్రభుత్వం తారురోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్లు నిధులు మంజూరుచేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సాంకేతిక కారణాలతో రహదారిని నిర్మించ లేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గతంలో తారురోడ్ల నిర్మాణం మంజూరై పనులు చేయని రహదారులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించింది. ఈక్రమంలో చింతలపూడి - ఉమామహేశ్వర అగ్రహారం రోడ్డు పనులను దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ యుద్ధప్రాతిపదికన పంచాయతీరాజ్ శాఖలో ఉన్న రహదారిని తారు రోడ్డుగా ఏర్పాటుచేశారు. నిన్నమొన్నటి వరకు ఆ రహదారిపై వాహన చోదకులు ప్రయాణం చేయలేక అవస్థలు పడ్డారు. ప్రస్తుతం తారురోడ్డుగా మారిపోవటంతో వాహన చోదకులకు ఇబ్బందులు తీరాయి.

వైభవంగా సాగుతున్న గణేష్ ఉత్సవాలు


దర్శి: విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న గణేష్ విగ్రహాలు



దర్శి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దర్శి పట్టణంతో పాటు గ్రామాల్లో మొత్తం 200 విగ్రహాలను వినాయక చవితి రోజు ఏర్పాటుచేశారు. అప్పటినుంచి ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్నారు. కొంతమంది సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం చేస్తున్నారు. గణేష్ ఉత్సవాలకు ఉచిత కరెంట్ ప్రభుత్వం అందిస్తుండటంతో రాత్రిపూట మందిరాలు రంగురంగుల కాంతులతో తలతలలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కరెంట్‌ను ఉచితంగా ఇవ్వటం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై ఆంధ్రజ్యోతి విద్యుత్ శాఖ అధికారులను అడగ్గా గణేష్ ఉత్సవాలకు విగ్రహాల వద్ద ఏర్పాటుచేసే విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ కోసం దరఖాస్తులు చేసుకున్న విగ్రహాలన్నింటికీ సరఫరా చేస్తున్నామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు


పామూరులోని వినాయక మండపంలో జరిగిన పూజల్లో పాల్గొన్న తహసీల్దార్, సీఐ, ఎస్ఐలు

పామూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. స్థానిక కందుకూరు రోడ్డులో వాటర్ ప్లాంట్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, సీఐ ఎం.భీమానాయక్, డాక్టర్ గద్దె ఏడుకొండలు, పామూరు, సీఎస్‌పురం ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వరనాయక్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే, కరెంటు ఆఫీసు కాలనీ, తూర్పు వీధిలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, టీడీపీ పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, మన్నం రమణయ్య, ధైండే రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం మండలంలోని అయ్యాలూరివారిపల్లెలో నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన స్వామివారి లడ్డూ వేలంలో పాలగోళ్ల మోహన్‌రెడ్డి, కవిత దంపతులు రూ.30 లక్షల 116 కు దక్కించుకున్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

దొనకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని త్రిపురాంతకం సీఐ హసాన్ పేర్కొన్నారు. మండలంలో శుక్రవారం దాదాపు 20 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈక్రమంలో ఆరవళ్లిపాడు, గంగదేవిపల్లి మరికొన్ని గ్రామాల్లో సీఐ పర్యటించి నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.త్యాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ రంగనాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని బసవాపురంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేశారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం సాగర్ కాలువలో నిమజ్జనం చేశారు.

రూ.19 లక్షలు పలికిన స్వామి కలశం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లె గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో మూడు రోజుల పాటు పూజలు అందుకున్న స్వామి కలశాన్ని శుక్రవారం నిమజ్జనం సందర్భంగా వేలం పాట నిర్వహించారు. ఈవేలంలో గ్రామానికి చెందిన ముత్యాల నారాయణరెడ్డి రూ.19 లక్షల 10 వేలకు పాటపాడి దక్కించుకున్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు


పామూరు: నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు

పామూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లోని పలు గ్రామాల్లో మూడవ రోజు శుక్రవారం నిమజ్జనానికి గణనాథులు తరలివెళ్లాయి. మండపాల్లో కొలువుతీరిన వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో తరలించారు. పామూరు మండలంలో శుక్రవారం పలు గ్రామాల నుండి 63 విగ్రహాలు, సీఎస్‌పురం మండలంలో 46 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లినట్లు ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వర నాయక్‌లు తెలిపారు.
పీసీపల్లి: వినాయకచవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథుల విగ్రహాలను మూడవ రోజైన శుక్రవారం నిమజ్జనం చేశారు. .ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం మండలపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాలను చేపట్టారు. తదనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా పెద్దన్నపల్లి, చిరుకూరివారిపల్లి, శంకరాపురం, మూలెవారిపల్లి గ్రామాలతో పాటు మండలంలోని మరికొన్ని గ్రామాల్లో గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లారు. శుక్రవారం మండలంలో 33వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కోటయ్య సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.

సంక్షేమ పథకాలను సక్రమంగా అమలుచేయాలి

- మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు ఆదేశం


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు

తాళ్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలుజరిపించే బాధ్యత మండల స్థాయి అధికారులదేనని మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో చాంబర్‌లో ఎంపీడీవో సానికొమ్ము సత్యం అధ్యక్షతన జరిగిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన పథకాలు సక్రమంగా గ్రామస్థాయిలో అమలుజరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు విన్నవిస్తే ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గం చూపాలన్నారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించినా ఎందుకు పురోగతి లేదని ప్రశ్నించారు. లబ్ధిదారులకు అవగాహన కల్గించి వేగవంతంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. మండలస్థాయి అధికారులు అప్రమత్తంగాఉంటూ గ్రామ స్థాయి ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బీవీ రమణారావు, హౌసింగ్ అధికారి హనుమంతరావు, ఏపీఎం దేవరాజ్, ఏపీవో వెంకటేశ్వరరావు, వైద్యాధికారి రాజేష్‌యాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాలి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ పరిశీలన

తాళ్లూరులోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. గృహాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు పూర్తికాగానే ప్రభుత్వం తక్షణమే బిల్లులు చెల్లిస్తుందన్నారు. లబ్ధిదారులు బిల్లుల గురించి ఆందోళన చెందకుండా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే, నాగంబొట్లపాలెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. ప్రతిఇంటి వద్ద, గ్రామాల్లో మురుగు నీరు వెలుపలకు రాకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్గించాలని ఎంపీడీవో, ఏపీవోలకు సూచించారు.

కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎస్.సత్యం, ఏపీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ అధికారి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- తహసీల్దార్ బీవీ రమణారావు


తాళ్లూరులో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్, వ్యవసాయాధికారి

తాళ్లూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బీవీ రమణారావు హెచ్చరించారు. విజిలెన్సు కమిటీ సభ్యులు వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏఎస్సై మోహన్‌రావుతో తహసీల్దార్ తాళ్లూరులో ఎరువులు,పురుగుమందుల దుకాణాలను శుక్రవానం ఆకస్మిక తనిఖీ చేశారు. తాళ్లూరులోని శ్రీకృష్ణా ఎంటర్‌ప్రైజర్స్ షాపును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. షాపులో అన్నిరకాల 113.25 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. శ్రీలక్ష్మి వెంకట రమణ ట్రేడర్స్‌ను పరిశీలించగా 77.35టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్టు గుర్తించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు సరిపడ ఎరువులను మాత్రమే ఇవ్వాలన్నారు. ఒక్కో రైతుకు పది బస్తాల మేర ఇవ్వాలని డీలర్లకు సూచించారు. పదికంటే ఎక్కువ బస్తాలు అవసరమైన రైతులకు చెందిన పాస్ బుక్‌లను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. రోజువారీ ఎన్ని బస్తాల ఎరువులు విక్రయించారో, ఎంత స్టాక్ నిల్వఉందో రికార్డుల్లో నమోదు చేసి అధికారులకు తెలియజేయాలన్నారు. తమ ఇష్టాను సారం తప్పుడు పేర్లు నమోదు చేసి కృత్రిమ కొరత సృష్టించినా, ప్రభుత్వ ధరలకంటే ఎక్కువగా అమ్మినా, అక్రమంగా ఎరువుల నిల్వలు ఉంచినట్టు గుర్తించినా తగు చర్యలు చేపట్టి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎంఎస్ఎంఈ పార్క్‌లో విద్యుత్ తీగ చోరీ

దర్శి ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు నిమిత్తం నిర్మించిన ఎంఎస్ఎంఈ పార్క్‌లో గుర్తుతెలియని వ్యక్తులు లక్షలాది రూపాయల విలువచేసే విద్యుత్ తీగను అపహరించారు. దర్శి మండలంలోని దర్శి-కురిచేడు రోడ్డులో వంద ఎకరాల స్థలంలో ఎంఎస్ఎంఈ పార్క్ నిర్మించిన విషయం తెలిసిందే. పరిశ్రమల ఏర్పాటు కోసం రోడ్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటుచేసి తీగలు బిగించారు. ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను ఏర్పాటుచేయకపోవటంతో విద్యుత్ సరఫరా ఆరంభించలేదు. ఈవిషయాన్ని గుర్తించిన దుండగులు సుమారు 950 మీటర్ల విద్యుత్ తీగను అపహరించారు. సుమారు రూ.4 లక్షల విలువ చేసే విద్యుత్ తీగను అపహరించటంతో ఆ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.మురళి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఇతర ప్రాంతాలకు చెందిన దొంగలు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను అనేక గ్రామాల్లో అపహరించారు. ఇప్పుడు కూడా ఇతర జిల్లాలకు చెందిన దొంగలే విద్యుత్ తీగ అపహరణకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ఈవిషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని త్వరలో నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా మిరప నాట్లు


నరసింహనాయునిపాలెంలో మిరపనాట్లు వేస్తున్న కూలీలు

దొనకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. ఇప్పటి వరకు సరైన వర్షం కురవక వర్షం కోసం ఎదురుచూస్తూ ఆందోళనలు చెందుతున్న రైతులకు గత రెండురోజులుగా కురిసిన వర్షం కొంతమేర ఊరటనిచ్చింది. పలు గ్రామాల్లో అనుకూలమైన వర్షం కురవటంతో విస్తారంగా మిరప నాట్లు వేస్తున్నారు. మండలంలో 2752 ఎకరాల్లో సాగుచేసిన పత్తి, 1305 ఎకరాల్లో సాగుచేసిన కంది పంటకు ప్రస్తుతం కురిసిన వర్షం జీవం పోసింది.

బీడు భూముల ఆక్రమణకు యత్నం


ఆక్రమణకు గురవుతున్న బీడు భూమిని పరిశీలిస్తున్న రైతులు

వెలిగండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో పశువుల బీడు భూములను ఆక్రమణకు యత్నించారు. రైతులు అడ్డుకొని శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెం.104-2 లో 30 ఎకరాలను కొంతమంది గ్రామస్థులు, బయట వ్యక్తులు యంత్రాల సహాయంతో చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. పూర్వం నుంచి రెవెన్యూ రికార్డుల్లో పశువుల బీడు భూమిగా నమోదయి ఉందని గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణదారులు దొంగ పట్టాలు సృష్టించి కాజేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. రూ.60 లక్షలు విలువచేసే 30 ఎకరాలకు పైగా ఆక్రమిస్తున్నారని తహసీల్దార్‌కు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బంగారు బాల్యంతో బాలల సమగ్రాభివృద్ధి



ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవిశంకర్

కనిగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా బాలల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తహసీల్దార్ ఏ.రవిశంకర్ అన్నారు. మండలంలోని ఏరువారిపల్లి గ్రామంలో బంగారుబాల్యం కార్యక్రమం ఏడాది ముగిసిన సందర్భంగా గుడ్‌హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాలల హక్కులను ప్రతిఒక్కరూ కాపాడాలన్నారు. బాలల సంరక్షణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం బంగారుబాల్యం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్ము వెంకటయ్య, ఆర్ఐ సుధాకర్, వీఆర్వో ప్రసాద్‌రెడ్డి, హెచ్ఎం సాంబశివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో ఫాగింగ్


తాళ్లూరులో ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తాళ్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాళ్లూరులో దోమల నివారణకు పారిశుధ్య పనుల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఫాగింగ్ చేపట్టారు. దోమలు ఉధృతంగా ఉండటంతో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ఎంపీడీవో ఎస్.సత్యం ఆదేశాలతో సర్పంచ్ ఎం.చార్లెస్‌సర్జన్, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగంలు పంచాయతీ నిధులు వెచ్చించి గ్రామంలో ఫాగింగ్ చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన ఫెడరేషన్ జిల్లా మహాసభలో నూతన అధ్యక్షుడిగా కె.సుబ్బరాయుడు(మార్కాపురం) ప్రధానకార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఒంగోలు), సభ్యులుగా కె.సామ్రాజ్యం, ఇట్లా నాగయ్య, చీమకుర్తి ఏడుకొండలు, టి.విజయమ్మ, బి.కోటేశ్వరరావు, సీహెచ్.ప్రసాద్, పి.పద్మ, బి.భారతిలను ఎన్నుకున్నారు.

అనంతరం మహాసభలో చేసిన తీర్మానాలను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. మునిసిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, గత సమ్మె కాలపు వేతన జీవోను ఇవ్వాలని, కొవిడ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.



• బాలికల వసతి గృహం

జేఎన్టీయూపై శీతకన్ను

ఎక్కడికక్కడే నిలిచిన నిర్మాణాలు

- ఏళ్లుగా సాగుతున్న కళాశాల పనులు
- నిధుల విడుదలపై వర్సిటీ మీనమేషాలు
- అక్టోబరు కల్లా వసతి అన్న వీసీ ప్రకటనకే పరిమితం
- రూ.44.2 కోట్ల ప్రతిపాదనలపై పాలకమండలి నిర్లక్ష్యం



నిర్మాణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్



పూర్తికాని కళాశాల భవనం

నిర్మాణాలపై నిర్లక్ష్యం

- అక్టోబరు కల్లా వసతి గృహ భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని జేఎన్టీయూ వీసీ గతంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.
- జేఎన్టీయూ కళాశాల భవన నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి.
- క్రీడా ప్రాంగణ భవనాల నిర్మాణం సగంలోనే ఉంది.
- పరిపాలన, ప్రయోగశాలల నిర్మాణాలను ఆరేళ్లుగా సాగదీస్తున్నారు.
- కళాశాల తరగతులకు సంబంధించి మూడు ఫ్లోర్లలో రెండు ఫ్లోర్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. మరో ఫ్లోర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రభుత్వ రంగంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నరసరావుపేటలో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటైంది. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చిందని.. పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో కళాశాల ఏర్పాటుతో పల్నాడు జిల్లా అభివృద్ధి చెందుతుందని అందరూ ఆశించారు. అయితే ఇక్కడ పేరుకు కళాశాల ఏర్పాటు చేసినా జేఎన్టీయూ స్థాయిలో నిర్మాణాలు, సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా నిర్మాణ పనులు సాగుతుండటంతో అసలు ఎప్పటికి కళాశాల పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందో తెలియక.. ఇప్పటికే అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కేటాయింపులో పాలక మండలి నిర్లక్ష్యం వందలాది మంది విద్యార్థులకు శాపంగా మారింది. కళాశాలపై వర్సిటీ పెద్దలు శీతకన్ను ప్రదర్శిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. నిధుల లేమితో పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణాలకు సంబంధించి కమిటీలు రూ.44.2 కోట్ల (మిగతా 6వ పేజీలో)

అధికారుల మరణ శాసనం

- అన్నదాత సుఖీభవతో వెలుగులోకి
- నెపాన్ని ఒకరిపై ఒకరు వేసుకుంటున్న శాఖలు
- అన్నదాత నగదు జమపై గ్రీవెన్స్‌కు 4731 అర్జీలు

గడువు ముగిసినా తహసీల్దార్ లాగిన్లలో పెండింగ్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అధికారుల మరణశాసనం ఇది. నిక్షేపంగా బతికి బాగున్న వారిని చంపేసిన వైనమిది. తమను అధికారులు చంపేసి రికార్డుల్లో నమోదు చేశారన్న విషయం సంబంధిత వ్యక్తులకు కూడా తెలియకపోవడం విశేషం. తీరా అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాకపోవడంతో బాధితులకు అసలు విషయం బోధపడలేదు. మరణించినట్లుగా రికార్డుల్లో ఉండటంతో అన్నదాత సుఖీభవ సొమ్ము చాలా మందికి జమ కాలేదు. బతికుండగానే చనిపోయిన జాబితాలో ఎక్కిన బాధితుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అలా



ఎలా జరిగిందని రెవెన్యూ అధికారులను అడిగితే తెలియదని సమాధానం దాటేస్తున్నారు. ఇదేందని వ్యవసాయ శాఖని నిలదీస్తే అసలు తమకు సంబంధమే లేదంటున్నారు. తప్పు జరిగిన తర్వాత కూడా గ్రీవెన్స్‌లో బాధితులు దరఖాస్తు చేసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది.

నాకు న్యాయం చేయాలి



నేను నిక్షేపంగా ఉన్నాను. అయినా రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు. ఇప్పటికైనా అధికారులు తప్పు సరిచేస్తారా అంటే అదీ లేదు. ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

- అంబటి భారతీ దేవి, బాధితురాలు

నిక్షేపంలా ఉన్న భారతీదేవి..

బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన అంబటి భారతీదేవికి వ్యవసాయ భూమి ఉంది. అన్నదాత సుఖీభవ సొమ్ము ఆమెకు జమ కాలేదు. అధికారులను సంప్రదిస్తే మృతి చెందినట్లుగా రికార్డుల్లో నమోదైనట్లు తేలింది. ఇదెలా జరిగిందని వీఆర్వోను ప్రశ్నిస్తే తెలియదన్నారు. జీవించి ఉన్నట్లుగా సర్టిఫికెట్ తీసుకుని తహసీల్దారు, వ్యవసాయ అధికారికి భారతీదేవి చూపించినా (మిగతా 6వ పేజీలో)

సెక్యూరిటీగార్డు అనుమానాస్పద మృతి

హత్యేనంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ



చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చీరాల పరిధి లోని సాల్మన్ సెంటర్‌లో ఓ సిమెంట్ ఖార్ఖానాలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న దివ్యాంగుడైన ఇంటూరి స్వామిదాస్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. అయితే హత్యేనని ఆరోపిస్తు చీరాల ఏరియా వైద్యశాల వద్ద కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జాండ్రపేట హస్తినాపురానికి చెందిన స్వామిదాస్‌కు పుట్టుకతోనే మూగ, చెవుడు. ఇతడికి భార్య కృప, కుమార్తె (మూగ, చెవుడు), కుమారుడు సంతానం. కాగా స్వామిదాస్ ఐదేళ్లుగా సాల్మన్‌సెంటర్ బేర్ గార్డెన్‌లో తోటమాలిగా పగలు, సమీపంలోని ఓ సిమెంట్ ఖార్ఖానాలో రాత్రి పూట సెక్యూరిటీగార్డు పనిచేస్తున్నా డు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో అస్వస్థతకు గురైనట్లు స్వామిదాస్ నోటినుంచి నురగ వస్తుందని ఖార్ఖానా నుంచి కుటుంబసభ్యులకు కబురు వచ్చింది. వారు అక్కడకు చేరేసరికి అతడు చనిపోయాడు. మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. అప్పుడు గమనించగా రక్తపు గాయాలను గుర్తించిన కుటుంబ సభ్యులు స్వామిదాస్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. భర్త మృతిపై సందేహాలు ఉన్నట్లు భార్య కృప, బంధువులు ఆరోపించారు. ఘటనపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

ఎట్టకేలకు భూసేకరణకు అనుమతి

- పట్టాలెక్కనున్న గుంటూరు ఛానల్ పొడిగింపు

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు ఛానల్ పొడిగింపు ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన భూసేకరణ చేసేందుకు అన్ని అనుమతులు లభించాయి. దాంతో గుంటూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ అధికారులు రెండు రోజుల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. రెవెన్యూ అధికారులు 60 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరించి భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్ల నున్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని ప్రాజెక్టుకు అవసరమైన పరిపాలన అనుమతులను ఒక్కొక్కటిగా ఇప్పిస్తున్నారు. దీంతో అధికారుల పని సులువుగా మారింది. నాలుగు దశల్లో విడుదల కావాల్సిన నిధుల్లో తొలిదశ కింద రూ.30.5 కోట్లు ఇప్పటికే జిల్లా ఖజానాకు చేరాయి. గుంటూరు జిల్లాలోని మూడు మండలాల్లో (వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు)ని 11 గ్రామాలకు ఉపయోగపడేలా గుంటూరు ఛానల్ విస్తరణ పనులు జరగనున్నాయి.. ఇందులో విభజిత గుంటూరు జిల్లాలోని 7 గ్రామాల్లో 201.149 ఎకరాల భూసేకరణ నిమిత్తం ప్రస్తుతం పీఎన్ జారీ చేశారు. మిగిలిన నాలుగు గ్రామాలకు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్‌ను సంబంధిత అధికారులు ఇవ్వాల్సి ఉంది. భూసేకరణకు రూ.100 కోట్లను విడుదల చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుతో పాటు జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రాజెక్టుకు రూ.75.12 కోట్లు మంజూరు కాగా తొలి దశలో రూ.30.5 కోట్లు, రెండో దశలో రూ.12.9 కోట్లు, మూడో దశలో రూ.18.33 కోట్లు, చివరి విడతలో రూ.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని పెమ్మసాని తెలిపారు.

బీచ్ ఫెస్టివల్‌కు భారీగా ఏర్పాట్లు చేయాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యలంక సముద్రతీరంలో మూడురోజులు నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌కు భారీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. ఈ ఫెస్టివల్‌కు సంబంధిం చి శుక్రవారం పర్యాటకశాఖాధికారులతో కలెక్టర్ కలెక్టరేట్‌లో సమీక్షించారు. సూర్యలంక సముద్ర తీరంలో వచ్చే నెల 26, 27, 28 తేదీల్లో జరిగే బీచ్‌ఫెస్టివల్‌కు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీచ్ క్రీడలు, సాంస్కృతిక, వినోద అంశాలను జోడించి జిల్లా ప్రత్యేకతను చాటేలా కార్యక్రమాలు ఉండేలా ప్రణాళిక రూపొందిం చాలన్నారు. లేజర్ షో, సాహసోపేత విన్యాసాలు, గాలిపటాలు ఎగురవేయడం, విద్యార్థులకు పోటీలు, సెల్ఫీపాయింట్లు మొదలైనవి ఏర్పాటు చేయాలన్నారు. ఆహారప్రియులను ఆకట్టుకునేవిధంగా ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మూడు రోజుల ఫెస్టి వల్‌లో భాగంగా 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూర్యలంక బీచ్‌కు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. రామాపురం బీచ్‌లో కూడా మూడురోజులు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశం అనంతరం అధికారులతో కలిసి సూర్యలంక తీరాన్ని కలెక్టర్ సందర్శించారు. వేడుకల ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ స్థలాలను ఎస్పీ తుషార్‌డూడి, పర్యాటక శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, పర్యాటకశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లక్ష్మీప్రసన్న, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, బాపట్ల పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీపీవో ప్రభాకర్, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, పర్యాటకశాఖాధికారులు

రూ.2 కోట్ల పనులకు ఆమోదం

27 అంశాలు ఏకగ్రీవం

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చీరాల మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో డ్రెయిన్లు, పారిశుధ్యం, సీసీ రోడ్లు, శ్మశాన వాటికలో సౌకర్యలకు సంబంధించి రూ2 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శుక్రవారం స్థానిక కౌన్సిల్ హాలులో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 29 అంశాలు అజెండాలో ఉంచగా 27 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్ని వార్డుల్లో పారదర్శకంగా అభివృద్ధి పనులు జరగాలని బొనిగల జైసన్‌బాబు తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కొండయ్య అడుగులు వేస్తున్నట్లు చైర్మన్ వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని ఐదు నెలల్లో చేస్తామన్నారు. వార్డుల్లో కుక్కల బెడదతో చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య తెలిపారు. సమావేశంలో కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురాం, టీపీవో గీత తదతరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ సాంబశివరావు, కౌన్సిలర్లు, అధికారులు

బార్లు మాకొద్దు.. బాబోయ్

- అరకొరగానే దరఖాస్తులు
- గడువు పెంచినా కొరవడిన స్పందన
- ఎక్సైజ్ అధికారుల ప్రయత్నాలు విఫలం
- మూడో వంతు బార్లకు అందని దరఖాస్తులు
- బాపట్ల జిల్లాలో నాలుగు బార్లకే పూర్తిస్థాయిలో..
- గుంటూరు జిల్లాలో 35, పల్నాడు జిల్లాలో 16 అర్హత
- నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన బార్లకు నేడు లాటరీ



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బార్లు అంటే మద్యం వ్యాపారులు భయపడుతున్నారు. గడువు పొడిగించినా బార్లకు దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం బార్లకు దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే తొలుత ఇచ్చిన గడువు ఈ నెల 26 కాగా స్పందన మరీ పేలవంగా ఉండడంతో శుక్రవారం వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు ఎక్కడికక్కడ వ్యాపారులతో ఎలాగైనా బార్లకు దరఖాస్తులు చేయించాలని పలు ప్రయత్నాలు చేశారు. అయినా వ్యాపారులు ముందుకు రాలేదు. శుక్రవారం రాత్రి గడువు ముగిసేప్పటికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మూడో వంతు బార్లకు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు రాలేదు. లాటరీ ప్రక్రియ జరగాలంటే ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు రావాలనే నిబంధనను పెట్టింది. మూడు జిల్లాల్లో మొత్తం 178 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా గడువు ముగిసేప్పటికి 55 బార్లకు మాత్రమే పూర్తి స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుంతో పాటు ఏడాదికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు కూడా భారమవుతుందని, వైన్ షాపులకు పర్మిట్ రూములతో లాభాలు కష్టమని వ్యాపారులు బార్ల వ్యాపారానికి మొగ్గు చూపలేదని తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి దరఖాస్తు సమయంలోనే (మిగతా 6వ పేజీలో)

రోడ్డు వేసి బస్సు రప్పించండి

- రోడ్డుపై కాలనీ వాసుల నిరసన

పర్చూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి 167 (ఏ) నిర్మాణంతో పర్చూరు మండలం చెన్నుంబొట్లఅగ్రహారంకాలనీ పాత రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో కాలనీకి బస్సు సౌకర్యం కూడా నిలిచిపోయి రాకపోకలకు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కాలనీవాసులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేసి యథావిధిగా బస్సుల రాకపోక లు కొనసాగించాలని పర్చూరు బొమ్మల సెంటర్‌లో కాలనీవాసులు నిరసన తెలిపారు. బస్సులు రాకపోవడంతో విద్యార్థులను పాఠశాలకు పంపించడానికి ఇబ్బంది పడుతున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంతోపాటు, కాలనీ నుంచి కూడా బస్సులు రాక పోకలు సాగించేలా చూడాలన్నారు. పోలీసులు నచ్చచెప్పడంతో కాలనీ వాసులు నిర సనను విరమించారు. వీరికి సీపీఎం నాయకులు పి.కొండయ్య, మత్తే డేవిడ్, దళిత నాయకుడు నలిగిల కిశోర్ సంఘీభావం తెలిపారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

బహురూప వినాయకులు



ఈపూరుపాలెంలో ఆపరేషన్ సిందూర్ వినాయకుడు

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చీరాల పరిధిలోని పలు మండపాల్లో వినూత్న రూపాల్లో వినాయకుడు భక్తులను ఆకట్టుకుంటున్నాడు. అమరావారివీధిలో బాల భక్త సమాజం ప్రతినిధులు వెయ్యి కేజీల నవ ధాన్యాలతో 20 అడుగుల ప్రతిమను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని ఈపూరుపాలెంలో పోతురాజు శిల సమీపంలో 12 అడుగుల అఖండ్ భారత్, ఆపరేషన్ సిందూర్ ఉదంతాన్ని ప్రదర్శిస్తు భక్తులు వినాయకుడికి పూజలు చేస్తున్నారు.



నవధాన్యాలతో అలరిస్తున్న గణనాథుడు

అవీ..ఇవీ..

అంతరాయం లేని విద్యుత్ సరఫరా



విద్యుత్ లైన్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా ధ్యేయంగా కొత్త విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీ(బలరామకృష్ణాపురం)లో విద్యుత్ ఆధునీకరణ పనులను ఈఈ మస్తాన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా నాణ్యమైన విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్‌కు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఈఈ దామోదరం, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందను ఢీకొట్టిన లారీ

మేదరమెట్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ ఎదురు గొర్రెల మందను లారీ ఢీ కొన్న ఘటనలో రెండు గొర్రెలు చనిపోయాయి. శుక్రవారం సాయంత్రం రోడ్డు అంచులో వెళుతున్న గొర్రెల మందను హైదరబాద్ నుంచి చైన్నై వైపు వెళుతున్న లారీ మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ ఎదురు గొర్రెల మందను తొక్కించుకుంటూ వెళ్లింది. రెండు గొర్రెలు లారీ ట్రైర్ల కింద నుజ్జు నుజ్జు అయ్యాయి. లారీ డ్రైవర్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా నడపడం వలనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గొర్రెల యజమాని వెంకటరామయ్య గొర్రెల మృతిపై పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు.

పాల ఆటోను ఢీ కొన్న గుర్తు తెలియని వాహనం

మేదరమెట్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల నుంచి జాగర్ల మూడి వారిపాలేనికి పాలు తీసుకువెళుతున్న ఆటోను గుర్తు తెలియని వాహనం గురువారం ఢీకొంది. ఆటో బోల్తా పడి పాలు అన్ని నేలపాలయ్యాయి. మేదరమెట్ల పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● ఒంగోలులో స్కానింగ్ సెంటర్లను పరిశీలించిన డీఎంహెచ్‌వో



ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలలో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నగరంలోని ప్రైవేటు వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మొత్తం తొమ్మిది సెంటర్లను పరిశీలించారు. ఆస్పత్రులలో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులు చూశారు. అక్కడ రోగులకు అందిస్తున్న సేవలతోపాటు వాటి వివరాలు నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరు ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్‌ను ఎస్టాబ్లిస్మెంట్ యాక్ట్ 2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైతే నమోదు చేసుకోరో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పొల్యూషన్, ఫైర్, బయోమెడికల్ వేస్టేజ్ అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆస్పత్రులు అందిస్తున్న సేవలు వాటికి వారు వసూలు చేసే ధరల పట్టికలను కూడా బోర్డుల్లో ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో డాక్టర్ శ్రావణ్‌కుమార్, మాస్ మీడియా అధికారి డి. శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు

కొండపి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై మద్యం మత్తులో ఉన్న యవకులు దాడి చేయడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. డ్రైవర్ బొమ్మిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి కొండపి నుంచి ఒంగోలుకు బస్సును తీసుకొని ప్రయాణికులతో వెళ్తుండగా, వెన్నూరు వద్ద ఒంగోలుకు చెందిన కుంచాల శ్రీనివాసులు, అతని స్నేహితుడు కలిసి మద్యం తాగి రోడ్డుపై అడ్డంగా తమ ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉన్నారు. వాహనాన్ని పక్కకు తీయాలని డ్రైవర్ కోరగా ఆగ్రహించిన యువకులు అతడిని బస్సు నుంచి లాగి కింద పడేశారు. అనంతరం దాడి చేశారు. దీంతో బస్సులోని మహిళలు, వెన్నూరు గ్రామంలోని కొందరు వ్యక్తులు నిందితులకు దేహశుద్ధి చేసి కొండపి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రే మ్‌కుమార్ కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను కొండపి వైద్యశాలకు, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ మునిసిపల్ వర్కర్స్ అం డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన ఫెడరేషన్ జిల్లా మహాసభలో నూతన అధ్యక్షుడిగా కె.సుబ్బ రాయుడు(మార్కాపురం) ప్రధానకార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఒంగోలు), సభ్యు లుగా కె.సామ్రాజ్యం, ఇట్లా నాగయ్య, చీమకుర్తి ఏడుకొండలు, టి.విజయమ్మ, బి.కోటేశ్వరరావు, సీహెచ్.ప్రసాద్, పి.పద్మ, బి.భారతిలను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభలో చేసిన తీర్మానాలను శుక్రవారం పత్రికలకు విడుదల చే శారు. మునిసిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, గత సమ్మె కాలపు వే తన జీవోను ఇవ్వాలని, కొవిడ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, పీ ఎఫ్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

రైతుల అంగీకారంతోనే భూములను లీజుకు తీసుకోవాలి : జేసీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల అంగీకారంతోనే అభివృద్ధి పనులకు భూములను లీజుకు సేకరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శుక్రవారం పీఎంకేయూఎస్‌యూఎం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరేషన్(ఎఫ్ఎల్ఎస్) కార్యక్రమం అమలుపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. ఈ పథకం కింద భూ కేటాయింపుల కోసం 121.75 ఎకరాల ప్రభుత్వ భూమి, 378 ఎకరాల పట్టాభూమిని గుర్తించామన్నారు. పట్టా భూముల రైతుల అంగీకారంతో ఆయా భూములను లీజు ఆధారంగా సేకరించి భూ కేటాయింపులు వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓ బులేషు, మార్కాపురం సబ్‌కలెక్టర్‌తో పాటు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగో లు, కనిగిరి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జనాలు

● ప్రారంభమైన వినాయక విగ్రహాల నిమజ్జన సందడి ● పలుచోట్ల కొనసాగుతున్న పూజలు



అద్దంకి నుంచి నిమజ్జనానికి వెళుతున్న వినాయకుడు

అద్దంకి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వినాయక వి గ్రహాల నిమజ్జనము ల సందడి ప్రారంభమైంది. అద్దంకి పట్టణంలో సుమారు 40 వరకు వినాయక వి గ్రహాలు ఏర్పాటు చేయగా శు క్రవారం ఐదు వి గ్రహాల నిమజ్జనాలు చేశారు. అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డులో గుండా ఊరేగింపు నిర్వహిస్తూ గుండ్లకమ్మ నది లో నిమజ్జనాలు చేశారు. సిఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వినాయక నిమజ్జన ఊరేగింపు, నిమజ్జనం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాలలో కూడా వినాయక వి గ్రహాల నిమజ్జనం చేశారు. నాగులపాడు లో ఆనవాయితీ సుమారు రెండు దశాబ్దాల కాలం నుండి ఏర్పాటు చేస్తున్న వినాయక వి గ్రహాల వద్ద నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో, నాగులపాడు తెలుగు యువత ఆధ్వర్యంలో ప్రత్యేక ఆకర్షణ గా ఉన్నాయి. రెండు వేర్వేరు రోజులలో నిర్వహించే వినాయక నిమజ్జన ఊరేగింపులకు కూడా ప్రత్యేకత ఉంటుంది. ఆయా రోజులలో వినాయక వి గ్రహాల నిమజ్జన ఊరేగింపులు తిలకించేందుకు అద్దంకి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తిలకిస్తుంటారు.

బల్లికురవ, : వినాయకచవితి పండగ సందర్భంగా పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గణనాధుల విగ్రహాలను శుక్రవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. మండ లంలోని నక్క బొక్కలపాడు, మల్లాయ పాలెం, కొప్పెరపాలెం గ్రామాలలో ఉదయం నుండే ప్రత్యేక మేళాలతో గణనాధుడిని ప్రత్యేక వాహనాలలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దగ్గరలో ఉన్న వీర్ల చెరువులో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా గ్రామాలలో సందడి వాతావరణం నెలకోంది. గ్రామాలలో నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు చోటు చుసుకోకుండా ఎస్ఐ నాగరాజు పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

అద్దంకి : అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ లో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం ను శు క్రవారం 10 రూపాయల నోట్ల తో ప్రత్యేకంగా అలంకరించారు. వెయ్యి నోట్ల తో వి గ్రహాన్ని అలంకరించారు. కొం డ్రగుంట శేషయ్య, ఈశ్వరమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.





గుండ్లకమ్మకు తరలిస్తున్న వినాయక విగ్రహం, రాంనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి నోట్లతో అలంకరణ

వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

● జేసీ గోపాలకృష్ణ హెచ్చరిక ● విస్తృతంగా రేషన్‌దుకాణాలు, పెట్రోల్ బంకులు, ఆర్వో ప్లాంట్ల తనిఖీ చేసిన అధికార యంత్రాంగం



మద్దిపాడులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ



నాగులుప్పలపాడులో పెట్రోల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

మద్దిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులను సక్రమంగా నిర్వహించని డీలర్లపై చర్యలు తప్పవని జేసీ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మద్దిపాడులోని రేషన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్బంగా జేసీ మాట్లాడుతూ రేషన్‌షాపుల ద్వారా నిర్వాహకులు నిత్యావసర సరుకులు బాధ్యతగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్, డీలర్ చుంచు హరిబాబు కళ్యాణి పాల్గొన్నారు. అనంతరం ఎరువుల దుకాణాలను, పెట్రోలు బంకులను తనిఖీ చేశారు.

- జరుగుమల్లి (కొండపి): మండలంలోని పలు రేషన్ షాపులను తహసీల్దార్ పి.మురళి శుక్రవారం తనిఖీ చేశారు. చిర్రికూరపాడులోని పెట్రోల్ బంకును, ఐటీసీ ఆర్వో ప్లాంటును పరిశీలించారు. వినియోగదారులను మోసం చేసి, అధిక ధరలకు అమ్మినా.. కల్తీ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈసందర్భంగా నిర్వాహకులను ఆయన హెచ్చరించారు.

- పొన్నలూరు: పొన్నలూరులోని ఎరువుల దుకాణాలను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న నిల్వలు, ధరల వివరాలను పరిశీలించారు. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లోని ఎరువులకు సరైన పత్రాలు లేనందున రూ.55,000 విలువైన నిల్వను, వేణుగోపాల్ ఫెర్టిలైజర్స్‌లో స్టాకును ఈ పాస్‌బుక్‌లో నమోదు చేయనందున రూ.2,27,571 విలువైన సరుకు అమ్మకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఏవో వి.రాము తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా స్టాక్ బోర్డులో ఎప్పటికప్పుడు నిల్వలను చూపించాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెట్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో తహసీల్దార్ వీఎస్.పాల్, కానిస్టేబుల్ కృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.

- నాగులుప్పలపాడు: పెట్రోలు బంక్‌లు, వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం నాగులుప్పలపాడులోని పెట్రోలు బంక్, మద్దిరాలపాడులోని వాటర్‌ప్లాంట్‌ను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సదరు పెట్రోలుబంక్‌లో స్టాక్‌బోర్డు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి సౌకర్యం, తాగునీరు, ఇంధనం కొలతలు, నాణ్యతను పరిశీలించారు. వాటర్ ప్లాంట్‌లో నీటి నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఉప్పుగుండూరులోని మనగ్రోమోర్‌ను ఎరువుల దుకాణాన్ని ఏవో వెంకట్రావుతో కలసి తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో సుబ్బరామయ్య పాల్గొన్నారు.

- సంతనూతలపాడు: మండలంలో శుక్రవారం తహసీల్దార్ నారాయణరెడ్డి పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లను, రేషన్‌షాపులను తనిఖీ చేశారు. గ్యాస్ ఏజెంట్లు, రేషన్ డీలర్లు, పెట్రోల్ బంకుల వద్ద ఎక్కడైన సరే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతనూతలపాడులో ఎరువుల షాపులను ఏవో పావని తనిఖీ చేశారు.

అధికారుల.. మరణ శాసనం

(5వ పేజీ తరువాయి)

ఆమెకు ప్రయోజనం దక్కలేదు. భారతీదేవిలా చాలామంది వృద్ధులను మృతుల జాబితాలో చేర్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు బాధితులు ముందే మేల్కొని సరి చేయించుకున్నారు. చాలామందికి విషయం తెలియక ఆలస్యం గా అధికారులను సంప్రదిస్తున్నారు. ఇలా మృతి చెందినట్లు చూపించిన వారి సమస్యను ఎలా పరిష్కరిస్తారన్న విషయంపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని బాధితులు వాపోతున్నారు.

గడువు ముగిసినా...

అన్నదాత సుఖీభవ పథకం అమలులో వచ్చిన సమస్యలు పరిష్కారానికి వినతుల స్వీకరణకు ఈ నెల 20 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. గుంటూరు జిల్లాలో 967, పల్నాడు జిల్లాలో 2145, బాపట్ల జిల్లాలో 1617 మంది అధికారులకు అర్జీలు ఇచ్చారు. వాటిలో ఎక్కువ శాతం మండల వ్యవసాయ అధికారులు క్లియర్ చేశారు. పల్నాడు జిల్లాలో 1952, గుంటూరు జిల్లాలో 918, బాపట్ల జిల్లాలో 1310 అర్జీలను పరిష్కరించారు. తహసీల్దార్ లాగిన్‌కి వెళ్లిన అర్జీలలో చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో తహసీల్దారు లాగిన్‌లోకి 56 అర్జీలు వెళ్లగా కేవలం 15 మాత్రమే పరిష్కరించారు. గుంటూరు జిల్లాలో 19 అర్జీల్లో 3, బాపట్ల జిల్లాలో 46 అర్జీల్లో 23 మాత్రమే తహసీల్దార్లు పరిష్కరించినట్లు సమాచారం.

బార్లు మాకొద్దు బాబోయ్

(5వ పేజీ తరువాయి)

రూ.5,10,000 చెల్లించాల్సి ఉండడం వెనకడుగుకు కారణంగా ఉంది. తొలుత ఇచ్చిన గడువు పెంచడంతో పాటు, ఆశావహులతో సమావేశాలు, ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారితో దరఖాస్తుల వేయమనే సంప్రదింపులు ఇలా అన్ని వైపుల నుంచి ఎక్సైజ్ అధికారులు ప్రయత్నించినా గడువు ముగిసే సమయానికి కనీస స్థాయిలో కూడా స్పందన కనబడకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం శనివారం కలెక్టరేట్ వేదికగా బార్ల లైసెన్సు కోసం లాటరీ ప్రక్రియ జరుగుతుందని, దరఖాస్తుదారులంతా ఉదయం 8 గంటలకే ఆయా కలెక్టరేట్లకు చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే మిగతా వాటి విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందున్న ఉత్కంఠ అందరిలో నెలకొంది.

- బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే నాలుగు బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అద్దంకిలో ఓ బార్‌కు 5, చీరాలలో ఓ బార్‌కు 5 దరఖాస్తులు వచ్చాయి. రేపల్లె, బాపట్లలో గీత కార్మికులకు బార్లు కేటాయించగా రేపల్లెలోని బార్‌కు లాటరీ తీయడానికి కావాల్సిన దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో నాలుగు బార్లు మాత్రమే లాటరీకి అర్హత సాధించాయి.

- గుంటూరు జిల్లాలో 110 బార్లకు గడువు ముగిసేటికి 48 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 35 బార్లకు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వీటికి మాత్రమే లాటరీ నిర్వహణకు అర్హత సాధించాయి. జిల్లాలో గౌడ సంఘానికి పది బార్లు కేటాయించగా 68 దరఖాస్తులు వచ్చాయి. ఈ సామాజిక వర్గానికి కేటాయించిన పది బార్లకు లాటరీ అర్హత పొందాయి.

- పల్నాడు జిల్లాలో 49 బార్లకు 65 దరఖాస్తులు వచ్చాయి. అందులో కేవలం 16 బార్లకు మాత్రమే లాటరీ నిర్వహించే అర్హత ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో గౌడ సంఘానికి ఐదు బార్ల కేటాయించగా, 22 దరఖాస్తులు వచ్చాయి. ఐదు బార్లు లాటరీ నిర్వహించేందుకు అర్హత పొందాయి.

గుప్తనిధుల ముఠా అరెస్టు

మొత్తం ఆరుగురు పట్టుబడ్డారు

పరారీలో సూత్రధారి, మరో ముగ్గురు

డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామంలోని కొండపైన ఉన్న రంగనాయకస్వామి దేవాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కనిగిరిలోని హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ కేసు వివవాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 22న నందనవనంలోని అడవిలో కొండపై ఉన్న మల్లప్పశెల రంగనాయకస్వామి ఆలయ గర్భగుడి కింద బంగారు గని ఉందని గుడి వెనుక భాగం నుంచి గర్భగుడి కిందకు పెద్ద గుంత తీశారు. అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించే క్రమంలో ఓ గ్రామస్థుడికి వారు కనిపించారు. అనుమానం వచ్చిన గ్రామస్థుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో తన పర్యవేక్షణలో సీఐ ఖాజావలి ఆధ్వర్యంలో ఎస్ఐ మాధవరావు, పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో హెచ్ఎంపాడు మండలానికి చెందిన గిద్దా ఏడుకొండలు, కండె మధుబాబు, సుంకిశాల రీగన్, కనిగిరి పట్టణానికి చెందిన పాలపర్తి రాజు, షేక్ పాచ్చావలి, పామూరు పట్టణానికి చెందిన వేముల ఏడుకొండలు ఉన్నారని డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు వెల్లడించారు. సూత్రధారి మరో ముగ్గురు పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు.

సూత్రధారిని త్వరలో పట్టుకుంటాం

నందనవనంలోని దేవాలయంలో తవ్వకాలకు పాల్పడిన ముఠాను అరెస్ట్ చేసి విచారించగా కనిగిరి మండలంలోని యడవల్లి గ్రామ సర్పంచ్, వైసీపీ నేత కాసుల పెద్దగురవయ్య గుప్తనిధుల తవ్వకాలకు ప్రధాన సూత్రధారి అని తేలిందని డీఎస్పీ తెలిపారు. పాడుబడిన దేవాలయాలను ఎంచుకుని వాటిల్లో నిధుల కోసం తవ్వకాలు చేపడుతూ వచ్చిన డబ్బుతో జల్సాగా తిరుగుతుంటాడని పేర్కొన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఓ ముఠాను తయారు చేసుకున్నాడని, అందులోని ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారన్న విషయాన్ని తెలుసుకున్న పెదగురవయ్య పరారయ్యాడని తెలిపారు. అతనితోపాటు వెలిగండ్లకు చెందిన కారుమంచి ఖజావలి, శివారెడ్డి, ఎలికావారి పల్లికి చెందిన పగడాల చెన్నరాయుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే వారికోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. సూత్రధారిని కలుగు నుంచి బయటికి తీసుకువచ్చి అరెస్ట్ చేస్తామని తెలిపారు. తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం అందగానే అప్రమత్తమై చాకచక్యంగా నిందితులను పట్టుకున్న సీఐ ఖాజావలి, ఎస్ఐ మాధవరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మొక్కలను నాటిన జనసేన నాయకులు



మొక్కలను నాటుతున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జన సేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరులోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సొ సైటీ డైరెక్టర్ పెంట్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌క ళ్యాణ్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరావు, అనిల్, అరుణ్, సాయి, శ్రీను, సుభాష్, మల్లెపూల గోపి, మాదాసు సుభాష్, వంశీ పాల్గొన్నారు.

బీడు భూముల ఆక్రమణకు యత్నం

వెలిగండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లిలో పశువుల బీడు భూములను ఆక్రమణకు యత్నించారు. రైతులు అడ్డుకొని శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెం.104-2లో 30 ఎకరాలను కొంతమంది గ్రామస్థులు, బయటవ్యక్తులు యంత్రాల సహాయంతో చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. పూర్వం నుంచి రెవెన్యూ రికార్డుల్లో పశువుల బీడు భూమిగా నమోదై ఉందని గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణదారులు దొంగ పట్టాలు సృష్టించి కాజేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. రూ.60 లక్షల విలువైన 30 ఎకరాలకు పైగా ఆక్రమిస్తున్నారని తహసీల్దార్‌కు తెలిపారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జేఎన్టీయూపై శీతకన్ను

(5వ పేజీ తరువాయి)

కేటాయింపునకు ఆమోదం తెలిపాయి. అయితే వర్సిటీ పాలక మండలి ఆ నిధుల విడుదలపై కనికరం చూపడంలేదు. బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. దీంతో నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాలికల వసతిగృహల పనుల పూర్తికి, 500 మీటర్ల పొడవును ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.11.20 కోట్లు విడుదల చేస్తేనే వసతిగృహాల పనులు ముందుకు సాగుతాయి. వెంటనే నిధులు విడుదల చేస్తే కనీసం రెండు మూడు నెలల్లో వసతిగృహాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిపై నేటి వరకు వర్సిటీ నిర్ణయం తీసుకోలేదు.

అరకొర వసతులతోనే నిర్వహణ

ప్రతిష్ఠాత్మకంగా ఉండాల్సిన జేఎన్టీయూ కళాశాలలో అరకొర వసతులతోనే నిర్వహిస్తున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల భవిష్యత్‌తో వర్సిటీ ఉన్నతాధికారులు ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనాల నిర్మాణానికి జేఎన్టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా కేవలం తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తి స్థాయిలో భవనాల నిర్మాణం జరగలేదు. రూ.33 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే కళాశాల భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఇందుకు సంబంధించి పాలక మండలి ఆమోదం తెలిపి ఏడాది అయినా నిధులు విడుదల కాలేదు. వైసీపీ హయాంలో నిరాదరణకు గురైన కళాశాల కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి సాధిస్తుందని, వసతులు సమకూరుతాయన్న విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. కనీసం వసతిగృహాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

తడిసి ముద్దయిన నగరం

● వర్షానికి పలు ప్రాంతాల్లో నిలిచిన నీరు



ఒంగోలులో జలమయమైన వీధి

ఏకధాటిగా కురిసిన వానకు నగరం తడిసి ముద్దయింది. దాంతోపాటు నగరంలోని పలు కాలనీల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. శుక్రవారం రాత్రి 8గంటలకు మొదలై ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు ప్రజలకి పాట్లు తప్పలేదు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి, బురదమయంగా మారాయి. నగరంలోని ప్రధాన వీధులన్నీ వర్షపునీరు, మరోవైపు లోతట్లు ప్రాంతాల్లో చెరువులను తలపించాయి. పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి, కొప్పోలు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ఇరిగేషన్ కార్యాలయం, మినీ స్టేడియంలలో నీరు నిలిచి, చెరువులు తలపిస్తుండగా, శివారు కాలనీలైన వెంకటేశ్వర కాలనీ, బలరాం కాలనీ, బిలాల్ నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషువా కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని కర్నూలు రోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం, స్టేషన్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

అవీ..ఇవీ..

నేడు అన్న క్యాంటీన్‌కు భూమిపూజ

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శనివారం భవన నిర్మాణ పూజ చేయనున్నారు. పర్చూరు నియోజకవర్గంలోనే తొలిసారిగా మార్టూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.61 లక్షల నిధులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. పేదలు, కూలీలు ఎక్కువగా ఉండే నాగరాజుపలి కూడలి సమీపంలోని స్థలంలో క్యాంటీన్ నిర్మాణానికి ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిదిగా భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం ఐసీడీఎస్‌లో నూతనంగా ఉద్యోగాలు పొందిన అంగనవాడీ కార్యకర్తలకు, ఆయాలకు నియామకపత్రాలను అందజేయనున్నారు.

క్యాంపు కార్యాలయంలో స్త్రీశక్తి మహిళా సదస్సు

శనివారం ఉదయం 11 గంటలకు ఏలూరి క్యాంపు కార్యాలయంలో స్త్రీశక్తి మహిళా సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే ఏలూరి ఏలూరి సాంబశివరావు పాల్గొంటారు. అనంతరం మార్కెట్ కమిటి చైర్మన్, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, రైతుల సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొంటారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

బల్లికురవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఆదివారం గుంటూరు శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అసవరమైన వారికి కంటి అపరేషన్లు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక బస్సులలో తీసుకు వెళ్లి అపరేషన్లు చేయించి తిరిగి తీసుకు వచ్చే ఏర్పాట్లు కూడా చేశామన్నారు. శిబిరానికి వచ్చే వారు రేషన్‌కార్డు గాని అరోగ్యశ్రీ కార్డును గాని తీసుకు రావాలని వారు కోరారు.

అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు

● మండల వ్యవసాయాధికారి భాస్కరరావు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏవో భాస్కర్‌రావు

చెరుకూరు(పర్చూరు), అగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే అట్టి దుకాణదారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని పర్చూరు ఏవో భాస్కర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చెరుకూరు గ్రామంలో ఆయా ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు, స్టాక్ రికార్డులో ఉన్న నిల్వలను సరిచూశారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయాలు నిర్వహించినప్పుడు తప్పక బిల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జున జన్మదినం సందర్భంగా అన్నదానం

మార్టూరు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు నాగార్జున జన్మదినం సందర్భంగా ఆయన అభిమాని నాగభైరుపాలేనికి చెందిన చిన్నం చల మయ్య శనివారం మార్టూరులోని అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఆయనకు ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

అద్దంకి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి మొత్తం 9 అంశాల అజెండాతో సమావేశం జరుగుతుందన్నారు.

అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తే చర్యలు

అద్దంకి,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో అద్దంకి, మేదరమెట్ల, పంగులూరులలో నిర్వహించే అన్నగారి సంతలలో మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏఎంసీ చైర్‌పర్సన్ వి. పద్మావతి తెలిపారు. కొంత మంది బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి సంతలలో ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. రైతులు మాత్రమే తాము పండించిన కూరగాయలు, ఇతర పంట ఉత్పత్తులు తెచ్చుకొని అమ్మకాలు చేసుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు అయ్యేలా, కొనుగోలుదారులకు తక్కువ ధరకు అందేలా ముందు రోజు ధరలు నిర్ణయించనున్నట్లు తెలిపారు.

బ్యాంకింగ్ సేవలతో ఆర్థికంగా రాణించాలి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకింగ్ సేవలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా రాణించాలని రిజర్వుబ్యాంకు ఏపీ రీజనల్ జనరల్ మేనేజర్ మహానా పేర్కొన్నారు. శుక్రవారం వేటపాలెంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా లీడ్ బ్యాంక్ మూడు నెలల ఆర్థిక కేంద్రీకృత కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో హాజరైన బ్యాంకు అధికారులు ఖాతా, డిజిటల్ లావాదేవీలు, బీమా పెన్షన్, రుణసౌకర్యం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్రెడిట్ కార్డ్ చీఫ్ మేనేజర్ సంపత్, నోడల్ అధికారి మహేంద్ర, వెలుగు సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మైనర్‌లు పోర్న్ వీడియోల వీక్షణపై కేసునమోదు

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని మైనర్లు పోర్న్ వీడియోలు వీక్షిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు చీరాల వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్ ద్వారా సమాచారం ఎస్పీ తుషార్ డూడీకు చేరడంతో ఆయన ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.





కేఆర్‌కే కళాశాలల్లో ఆకట్టుకున్న అధ్యాపకుల తెలుగు కవుల వేషధారణలు, మైలవరంలో గిడుగు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, పంగులూరులో గిడుగు, ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

తెలుగుతోనే మన వెలుగు

- గిడుగు రామ్మూర్తి పంతులకు ఘన నివాళి
- తెలుగు కవుల వేషధారణలో ఉపాధ్యాయులు
- ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పించిన విద్యార్థులు

అద్దంకిటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మన మాతృభాష తెలుగు చదవడం రాయడం నేర్చుకుంటే అన్ని బాషాలల్లో రాణిస్తారని, తెలుగే మన వెలుగు అని పలువురు కొనియాడారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవ వేడుకలు పాఠశాలలు, కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ అధ్యాప కులు డాక్టర్ చదలవాడ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి సహకారంతో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. వాడుక బాష ఉద్యమం కోసం అందించిన సేవలను, గి రిజనుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన సవర బాషకు రచించిన వ్యాకరణాన్ని, అందుకు బ్రిటిష్ ప్రభుత్వం రావు బహదూర్ బిరుదుతో గౌరవించిందని కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యాపకులు డాక్టర్ పి. శ్రీనివాసరావు గిడుగు రామ్మూర్తి పంతులు పాత్రదారణతో పాటు పలువురు అధ్యాపకులు సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేసిన కవులు, నాటక రచయితలు, నటుల పాత్రలతో ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ డాక్టర్ వి.మోహనరావు, రోటరీ క్లబ్ సభ్యులు రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన, ఎన్.షర్మిల, జి.అంజయ్య, జ్యోతిచంద్రమౌళి, రోటరీ అధ్యక్షుడు పూర్ణచంద్రావు, శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, తిమ్మాయపాలెం, బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి (క్రీడాదినోత్సవ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైలవరంలో విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. ఎన్.నాగేశ్వరరావు, పి.గంగాధరరావు, సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుభాషకు పూర్వవైభవం రావాలి

అద్దంకిటౌన్ : తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. శుక్రవారం రాత్రి స్థానిక కమతేశ్వరస్వామి ఆలయంలో సృజన ఆధ్వర్యంలో మాతృభాషాదినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పద్య శాసనం, ఎర్రాప్రగడ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో సృజన అధ్యక్ష, కార్యదర్శులు గాడేపల్లి దివాకర్‌దత్తు, కే.అనిల్‌కుమార సూరి, జానపద కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు దేవపాలన, చంద్రమౌళి, లేవీ.ప్రసాద్, రఫీ, రఘురామశర్మ, నాగేశ్వరరావు, సీతారామశాస్త్రీ, త్రిమూర్తులు, కోటయ్య, భువనేశ్వరి, రమణారెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవంతో పాటు తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యావహారిక భాషకుగిడుగు రామ్మూర్తి పంతులు, క్రీడలకు ధ్యాన్‌చంద్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వారిచిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిద పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఐ.అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, వీడీ.హనుమయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని కుందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు వాడుక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగువాడుక భాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారా బాలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, ఆరోగ్య పరిరక్షణ వంటి విలువలు పెంపొందుతాయని వారు పేర్కొన్నారు. మాతృభాష ద్వారానే ఇతర భాషలను కూడా సులువుగా నేర్చుకోవచ్చని, మాతృభాష పట్ల అందరూ అభిమానాన్ని పెంపొందించుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : నేటి యువతరం మహనీయుల ఆశయాలను, ఆలోచనలను అందిపుచ్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత హాకీ ప్లేయర్ ధ్యాన్‌చంద్ జయంతి, తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహులు గిడుగు రామమూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు ఉమ్మిటి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు శ్రావణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు. దేశాయిపేటలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీ బాపూలే బలహీన వర్గాల సాంఘిక గురుకుల పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యా యులు డా.నారాయణస్వామి, ప్రత్తి వెంకట సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ : అమ్మలాంటి తెలుగు భాషను ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలని, బల్లికురవ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో మాతృభాషదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుభాషకు వ్యవహారికంలో తీసుకొచ్చిన ఉపాధ్యాయుడు గిడుగు రామ్మూర్తి వేషధారణలో విద్యార్థి గురుశ్యామ్ సభలో ప్రసంగించి విద్యార్థులను అకట్టుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు గంగవరపు సునీత పాల్గొన్నారు.

పర్చూరు : ప్రస్తుతం ఆంగ్లబాష మోజుతో తెలుగు బాష కొంత నిర్లక్ష్యానికి గురవుతుందని, తెలుగుభాష గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని ఎంఈవో శివకోటేశ్వరరావు అన్నారు. గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు భాషదినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో-2 పి.వెంకట్రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతృభాషపై పట్టుఉంటేనే మిగిలిన భాషలపై అవగాహన సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.నాగిరెడ్డి, సుబ్బారావు, హనుమంతురావు, ఈదర రాజశేఖర్, బి.సురేష్, కేవీ.ప్రసాద్, పి.నాగలక్ష్మి, బొప్పూడి ప్రసాద్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగుభాషాదినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని జడ్పీహైస్కూల్‌లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వాటి విశిష్టతను విద్యార్థులకు తెలియ జేశారు. అంతకు ముందు వేదికపై మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తిల చిత్రపటాలకు విద్యార్థులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. వివిధ ఆటల పోటీలలో విజేతలకు దాత మక్కెన వీరరాఘవులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీబాయ్ ఉపాధ్యాయులు పి.కోటేశ్వరరావు, కే.పాల్‌మిల్టన్, శ్రీనివాసరావు, రమాదుర్గ తదితరులు పాల్గొన్నారు.




రామమూర్తికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, పర్చూరులో తెలుగు కవుల చిత్రపటాలతో ఉపాధ్యాయులు

రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఉషారాణి



అంబడిపూడి సభలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఉషారాణి, ఏవో శ్రీనివాసరావు

బల్లికురవ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులంతా రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే సేంద్రీయ వ్యవసాయాన్ని చేపట్టాలని డాట్‌సెంటర్ శాస్త్రవేత్త ఉషారాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో అత్మ, అద్దంకి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ(రైతుసంఘం) ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి పద్ధతిలో సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు . ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతు భూములలో సూక్ష్మజీవులు పెరిగేలా రైతులు గ్రామాలలో దొరికే ప్రకృతి ఎరువులను వినియోగించాలన్నారు. మార్టురు వ్యవసాయ శాఖ ఏడీఏ సుదర్శనరాజు మాట్లాడుతు రైతులు ఒకేసారి సేంద్రీయ వ్యవసాయ చేయకుండా క్రమక్రమంగా ఎరువుల వినియోగాన్ని తగ్గించి పంటలు సాగు చేస్తే ఎంతోమేలు జరుగుతుందన్నారు. అంబడిపూడి గ్రామంలోనే రైతులకు అవసరమైన సేంద్రీయ ఎరువులు రైతుసంఘం దుకాణంలో అందుబాటులో ఉంటాయని రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన బీజామృతం, ఘన జీవామృతం, ద్రవజీవామృతం వంటి కషాయాలను సొంతంగా తయారు చేసుకోవాలన్నారు. వేప నూనే వలన పురుగుల బెడద తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో బల్లికురవ మండల వ్యవసాయశాఖ ఏవో పి.శ్రీనివాసరావు, ఏఈవో మౌలాలి, రైతుసంఘం డీఎం వందనం, అంబడిపూడి ఫార్మర్ కంపెనీ సీఈవో బి. దేవి, రైతులు దద్దాల అంజయ్య, కిలారి వెంకట్రావు, బొట్లగుంట కోటేశ్వరరావు, మరియు పలు గ్రామాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు: పంటసాగులో సేంద్రియ ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమూరు గ్రామంలో శుక్రవారం సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో భూమిలో సమతుల్యత కోల్పోయి పంటలపై చీడపీడలు ఆశిస్తున్నాయన్నారు. ప్రతిరైతు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటసాగు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయం విభాగ ప్రతినిధి శిరీష మాట్లాడుతూ బీజామృతం, ఘన, ద్రవ బీజామృతాల తయారీ, బెల్లం కషాయం తయారీవిధానం, పీఎండీఎస్ కిట్లు సాగుచేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీదేవి, స్థానిక నేతలు కాటా అంజయ్య, మక్కెన శ్రీనివాసరావు, రైతుసేవా కేంద్ర ప్రతినిధి మస్తాన్, సాయికృష్ణ, మస్తానయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయండి

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంలో వేగంపెంచాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అధికారులతో డివిజనల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్ సప్లయిస్ సమస్యలు వాటికి సంబంధించిన కోర్టు కేసులు, పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలు, సర్వే సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రీసర్వే స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లు డిప్యూటీ తహసీల్దార్లు, రీసర్వే ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు స్టీలు గ్లాసుల బహూకరణ

పందిళ్లపల్లి(చీరాల), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థిని గుత్తి మేఘన 250 స్టీలు గ్లాసులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు దీప్తి మాట్లాడుతూ 2017-18లో పాఠశాల విద్యార్థినిగా మేఘన 10 జీపీఏ సాధించినట్లు వివరించారు. అనంతరం నూజివీడులో ఐఐఐటీ పూర్తి చేసి, హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ఆమె ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లలితా పరమేశ్వరీ, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, భవానీ, చైతన్య, ప్రసన్నాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్వాన్ జ్యోతి చంద్రమౌళికి తెలుగు కీర్తి పురస్కారం



చంద్రమౌళిని సత్కరిస్తున్న అతిథులు సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భాష, సాహిత్యం, జానపద, చారిత్రక, శాసన పరిశోధనలో విద్వాన్‌జ్యోతి చంద్రమౌళి అత్యుతమ కృషి చేశారని పాన్ ఇండియన్ సోసియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అద్దంకి రాజా అన్నారు. గురువారం రాత్రి హైదరబాద్‌లో సురవరం ప్రతాప్‌రెడ్డి విశ్వవిద్యాలయం(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం)లో ఆ సంస్థ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, కంచర్ల గోపన (రామదాసు) పదవతరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు, గిడుగు వెంకటరామ్మూర్తి మునిమనుమడు గిడుగు కృష్ణారావుల చేతుల మీదుగా తెలుగుబాష కోసం కృషి చేసిన విద్యాన్ జ్యోతి చంద్రమౌళిని దుశ్శాలువా, ముత్యాలహరం, ధ్రువీకరణ పత్రం, జ్ఞాపికతో పాటు తెలుగు కీర్తి పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ యనతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగుభాష కోసం కృషి చేసిన, చేస్తున్న మరి కొందరికి ఈ పురస్కారాలు అందజేసి సత్కరించారు.

ప్రాధాన్యత క్రమంలో అర్జీలకు పరిష్కారం

● నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్




ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మహేంద్రనాథ్


చీరాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపనున్నట్లు టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ క్రమంలో 90 అర్జీలు రాగా వాటిల్లో నివేశన స్థలాల కోసం 65, పెన్షన్ల కోసం 20, ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలు ఉన్నట్లు వివరించారు. ప్రజాదర్బార్‌తో సుదీర్ఘకాలంగా నెలకొంటున్న సమస్యలకు సైతం పరిష్కారం చూపినట్లు చెప్పారు. అనంతరం దేశాయిపేట గ్రామంలో శ్రీ బాలగణపతి సేవా సమాజం వారు నిర్వహిస్తున్న వినాయక పందిరి వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుబాబుల్ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న గ్రానైట్ లారీ

● మహిళా కూలీ మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు





రోడ్డు అంచులోనికి దూసుకుపోతున్న ట్రాక్టర్, మృతిచెందిన మేరమ్మ, ప్రమాదానికి కారణమైన లారీ

బల్లికురవ, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాయపాలెం సమీపంలో సుబాబుల్ లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి గ్రానైట్ లారీ ఢీ కొంది. దీంతో ట్రాక్టర్‌పై కూర్చొని ఉన్న ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాల య్యాయి. బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన 20 మంది కూలీలు శుక్రవారం సుబాబుల్ కర్రకొట్టేందుకు మల్లాయపాలెం వెళ్లారు. సుబాబుల్ కర్రను ట్రాక్టర్‌కు లోడు చేసుకొని బల్లికురవ వైపు వస్తుండగా శుక్రవారం రాత్రి గ్రానైట్ రాయి లోడింగ్‌కు వెళ్తున్న లారీ వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై కూర్చొని ఉన్న నలుగురు కూలీలలో కొత్తపల్లి ఏసమ్మ, జొన్నలగడ్డ మేరమ్మ, గంధం మరియమ్మ, పందిరి చినసుబ్బయ్యలకు తీవ్రగాయాలు అయ్యాయి. సుబాబుల్ ట్రాక్టర్ రోడ్డు మార్జిన్‌లోకి దూసుకు పోయింది. కట్టెల కింద పడి ఉన్న కూలీలను హుటాహుటిన బంధువులు నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో మేరిమ్మ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నాగరాజు పరిశీలించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

అద్దంకిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మరింతగా పెంచేలా బోధనలు చేయాలని మైనంపాడు డైట్ కళాశాల అధ్యాపకులు యూ.రామకృష్ణా రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని చక్రాయపాలెం మోడల్ ప్రైమరి స్కూల్‌ను ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలు, విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు, బోధనోపకరణాల వినియోగం, డిజిటల్ బోర్డులు, ఫౌండేషన్ అండ్ లిటరసీ కార్యక్రమాలు, ఉపాధ్యాయుల హ్యాండ్‌బుక్, మూల్యాంకన పుస్తకాలు, సిలబస్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉపాధ్యాయులు, సీఆర్‌పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి 5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025



మూడు రోజులపాటు భక్తుల నుంచి పూజలందుకున్న వినాయకులు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరారు. మండపాల నుంచి చెరువులు, నదులు, సముద్రం ఇతర జలవనరుల వరకు ప్రతిమలను ఊరేగింపుగా భక్తులు తరలించారు. అంతకుముందు స్వామివారి వద్ద ఉంచిన లడ్డూలను వేలం వేసి, ఉట్టి మహోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత డప్పుల వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల నడుమ యువత రంగులు చల్లుకుంటూ గణపతుల ప్రతిమలను తరలించారు. జలంలో ప్రతిమలను నిమజ్జనం చేసి ఉండ్రాలయ్యకు వీడ్కోలు పలికారు.

- ఆంధ్రజ్యోతి బృందం

బై బై గణేశా!

- గంగమ్మ చెంతకు చేరిన గణనాథులు
- ఉత్సాహంగా నిమజ్జనం

నెల్లూరు : స్వర్ణాల చెరువులోని గణేశ్ ఘాట్‌లో క్రేన్ సాయంతో వినాయక ప్రతిమ నిమజ్జనం

గణనాథుడి నిమజ్జనంలో అపశ్రుతి

- బాణసంచా పేలి 10 మంది చిన్నారులకు తీవ్ర గాయాలు

8లో..

కరెన్సీ నోట్లతో.. సంగం మండలం సిద్దీపురంలో రూ.3లక్షల నోట్లతో బాల విఘ్నేశ్వరుడు

కావలి రూరల్ : చెన్నాయపాళెం తీరంలో వినాయ ప్రతిమను కడలిలో నిమజ్జనం చేస్తూ..



జ్యోతి ప్రజ్వలన చేసి తెలుగు భాషోత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

తెలుగు మహోత్సవం

నెల్లూరు పురమందిరంలో శుక్రవారం ఉదయం తెలుగు భాషోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సేవ తెలుగుభాషా సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకను తొలి రోజు పూర్వ ఉపరాష్ట్రపతి వెంయ్యానాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అంతకముందు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రసారభారతి విశ్రాంత అదనపు డైరెక్టర్ డాక్టర్ రేవూరు అనంతపద్మనాభరావు, ఎస్వీయూ శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితర ముఖ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- వివరాలు 8లో...

ధాన్యం కొనుగోలు చేయండి సార్!

- కలెక్టరేట్ ఎదుట కౌలురైతు సంఘం ఆందోళన



నెల్లూరు (వైద్యం) : ధాన్యం కొనుగోలు చేయాలంటూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద కౌలు రైతుసంఘం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల గురున్నాథం, తుళ్లూరు గోపాల్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కొనుగోలు కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలన్నారు.

రూ.12లకే కిలో ఉల్లి

- రైతుబజార్లలో అమ్మకాలు
- జిల్లాకు 5 టన్నుల దిగుమతి

8లో..

ఆ గంటన్నరలో 'ఏం చెప్పింది!

- ఏఎస్పీ సౌజన్య ఎదుట గుట్టు విప్పిన అరుణ
- అందరినీ పంపి ఏకాంతంగా వివరాల సేకరణ
- తనను ఒంటరిదాన్ని చేశారంటూ ఆవేదన?
- నేడు కూడా కొనసాగనున్న విచారణ

'కిలేడి' నిడిగుంట అరుణను రెండవ రోజు శుక్రవారం విచారించిన పోలీస్ అధికారులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విచారించిన పోలీసులకు అరుణ కోరిక మేరకు ఏఎస్పీ సౌజన్య ఏకాంతంగా మాట్లాడారు. సుమారు 3.30 గంటల నుంచి 5 గంటల వరకు సాగిన ఈ విచారణలో అనేక అంశాలను ఏఎస్పీ దృష్టికి తెచ్చినట్టు సమాచారం. ఈ గంటన్నర సమయంలో అరుణ పోలీసులకు ఏం చెప్పిందనే అంశమే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

కోవూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఏఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, మహిళా సీఐ నాగేశ్వరమ్మ, కోవూరు సీఐ సుధాకర రెడ్డిలు అరుణను విచారించారు. అయితే, విచారణ కొనసాగుతుండగా మధ్యాహనం అరుణ అకస్మాత్తుగా ఓ నిర్ణయం తీసుకున్నారు. తన న్యాయవాది సహా పోలీసు అధికారులంతా వెలుపలకు వెళ్తే ఏకాంతంగా మాట్లాడతానని ఏఎస్పీతో అన్నారు. దీంతో అందరూ వెలుపలకు వచ్చేశారు. ఆ తర్వాత సుమారు ఒకటిన్నర గంటపాటు ఏఎస్పీతో అరుణ మాట్లాడినట్లు తెలిసింది. శ్రీకాంత్‌కు పెరోల్ వ్యవహారం గురించి పూసగుచ్చినట్లు వివరించినట్లు తెలిసింది. తనను ఒంటరిని చేసి తనపై పలువురు కక్ష కట్టి, కుట్రపన్నినట్లు అరుణ కన్నీటి పర్యంతమైందని భావిస్తున్నారు. ఇంకా అనేక నేరాల గురించి ఆమె విపులంగా వివరించినట్లు భావిస్తున్నారు. మొత్తానికి నేరాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని పోలీసు అధికారులు రాబట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎమ్మెల్యే వీడియోపై లోతుగా విచారిస్తాం : ఏఎస్పీ

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని హత్య చేస్తే డబ్బే డబ్బు అంటూ నలుగురు యువకులు మాట్లాడినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోపై లోతుగా విచారిస్తామని ఏఎస్పీ సౌజన్య అన్నారు. విలేకరులు ఆమెకు వీడియో చూపించి వివరాలు అడగ్గా తానిప్పుడే వీడియో చూస్తున్నాననీ, లోతుగా విచారిస్తామన్నారు. అరుణ కేసు వ్యవహారమై తానేమీ చెప్పలేనని, విచారణ అనంతరం అధికారులు నివేదిక రూపంలో వివరాలు తెలియజేస్తామని అన్నారు. శనివారం కూడా అరుణను విచారించనున్నట్లు తెలిపారు.

40 నుంచి 50 ప్రశ్నలు

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసు అధికారులు అరుణను సుమారు 40 నుంచి 50 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. చాలా ప్రశ్నలకు తెలియదని, గుర్తులేదని చెప్పినట్లు తెలుస్తోంది. సాయంత్రం కావడంతో ఆమెను తిరిగి నెల్లూరులోని జిల్లా జైలుకు తరలించారు. అయితే, కస్టడీ విచారణకు తమను మధ్యాహ్నం నుంచి రానివ్వలేదని ఆరోపిస్తూ అరుణ తరపు న్యాయవాది ఎస్ మురళి స్థానిక మేజిస్ట్రేట్ కోర్టులో అప్పటికప్పుడు మెమో దాఖలు చేశారు.

విచారణ కోసం కోవూరు సీఐ కార్యాలయానికి అరుణను తీసుకువస్తున్న పోలీసులు



పోలీసులకూ నో ఎంట్రీ!

అరుణను ప్రశ్నిస్తున్న కోవూరు సీఐ కార్యాలయ ఆవరణలోకి పోలీసులను సైతం రాకుండా ఉన్నతాధికారులు నిషేధించారు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్ కూడా సర్కిల్ కార్యాలయం వెలుపలే గంటల తరబడి వేచి ఉన్నారు. కస్టడీ విచారణలో అరుణ చెప్పే విషయాలు వెలుగులోకి రాకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. సర్కిల్ కార్యాలయ పరిసర ప్రాంతంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

కంటైనర్ సబ్‌స్టేషన్లు వచ్చేస్తున్నాయ్!

రద్దీ ప్రాంతాలకు ఇక నాణ్యమైన విద్యుత్

రూ. 4.2 కోట్లతో నెల్లూరులో ఏర్పాటు

పనులకు నేడు శంకుస్థాపన

నెల్లూరు (జడ్పీ): తక్కువ స్థలం, రద్దీ ప్రాంతాల్లో కరెంటు సమస్య పరిష్కారానికి కంటై నర్ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రప్రథంగా తొలి కంటైనర్ సబ్ స్టేషన్‌ను నెల్లూరులో ఏర్పాటు చేస్తున్నారు. సహజంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పా టుకు 10 సెంట్ల స్థలం అవసరం ఉంటుంది. దీంతో నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాలలో స్థల సేకరణ విద్యుత్ శాఖకు తీవ్ర సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో వినూత్నంగా కంటైనర్ సబ్‌స్టేషన్లను కేవలం 4 లేదా 5 సెంట్లలో ఏర్పాటు చేసేలా రూపకల్పన చేశారు. నగరంలోని గాంధీబొమ్మ సమీపంలో ఉన్న స్వతంత్ర పార్కులో రూ.4.2 కోట్లతో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గాంధీబొమ్మ, పొగతోట, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ ఇతర వాణిజ్య దుకాణాలు ఉండటంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటూ లో వోల్టేజ్ సమస్య తలెత్తుతోంది. దూరంగా ఉన్న సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండటంతో సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ఈ సమస్య పరిష్కారానికి కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. 12.5 మీటర్ల స్పన్ స్తంభాలు, 11 మీటర్ల పీఎస్‌సీసీ స్తంభాలు, 20 కి.మీ పొడవున 11కేవీ తీగలు, 4ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ కార్యాలయంలోని స్కాడాకు అనుసంధానం చేస్తున్నారు. రిమోట్ ద్వారా సబ్‌స్టేషన్ నిర్వహణ ఉంటుంది. ఈ కంటైనర్ సబ్ స్టేషన్ ద్వారా దాదాపు 5వేల మంది వినియోగదారులకు ఉపయోగం కలగనుంది. కంటైనర్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శనివారం ఉదయం పది గంటలకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ఎస్ఈ విజయన్ పర్యవేక్షిస్తున్నారు.



విజయవాడలో ఏర్పాటు చేసి ఉన్న కంటైనర్ సబ్‌స్టేషన్

నియోజకవర్గాల అభివృద్ధికే 'ఎల్‌ఆర్‌ఎస్' నిధులు

- కొత్త వెంచర్లలో పది శాతం భూమి వదలాల్సిందే!
- వైసీపీ హయాంలో 'నుడా' నిర్వీర్యం
- జరిగిన అక్రమాలపై త్వరలో విజిలెన్స్ విచారణ
- ఎమ్మెల్యేల సమీక్షలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గాల అభివృద్ధికే 'ఎల్‌ఆర్‌ఎస్' నిధులు ఖర్చు చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగురు నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో కలెక్టర్ ఓ ఆనంద్‌తో పాటు నుడా పరిధిలోని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జగన్ సర్కారు అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీలను పట్టించుకోలేదని, అందులోని నిధులను చెల్లాచెదురు చేశారని ఆక్షేపించారు. నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) పరిధిలోని విభాగాలన్నిటినీ సర్వనాశనం చేశారని, ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండానే డబ్బులు డ్రా చేసేశారని దుయ్యపట్టారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యేల నుంచి విజ్ఞప్తులు అందుతున్నాయన్నారు. త్వరలోనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఎవరూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఎల్‌ఆర్‌ఎస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. భవన నిర్మాణాలకు అనేక సులభ పద్ధతుల్లో అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆయా స్థానిక నియోజకవర్గాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన వెంచర్లు ఏర్పాటు చేసే వారు పార్కులు, దేవాలయాలకు 10 శాతం భూమి ఇచ్చి తంగా వదలాలని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, ఆర్డీవో అనూష, కమిషనర్ నందన్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగ నగరంలోని 14వ డివిజన్ వద్ద జగదీష్‌నగర్‌ల అదానీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటైన పార్కు, ఎన్టీఆర్ సుజల సురక్షిత మంచినీటి పథకాలను మంత్రి ప్రారంభించారు. ఈ ఏడాది చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.



నుడా సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, చైర్మన్ కోటంరెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు, అధికారులు

ఆదరణ అంతంత మాత్రమే!

- 55 బార్లకు అందిన దరఖాస్తులు 18
- నెల్లూరులో 10, కావలిలో 2, కందుకూరులో 3
- గీతకులాల కోటాలో నెల్లూరులో 2,కావలిలో ఒకటి
- ముగిసిన గడువు, నేడు జడ్పీలో లాటరీ

నెల్లూరు(క్రైం) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన బార్ల పాలసీకి ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. వ్యాపారుల నుంచి ఆదరణ లేకపోవడంతో ప్రభుత్వం గడువు పెంచింది. అయినా పెద్దగా దరఖాస్తులు రాలేదు. దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం వరకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో జిల్లాలో 55 బార్లు ఉండగా 18 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఇక గీత కులాలకు సంబంధించి జిల్లాలో ఐదు బార్లకు సంబంధించి నెల్లూరులో రెండు బార్లకు మాత్రమే 9 దరఖాస్తులు మాత్రమే అందాయి. కావలి ఒకటి ఉండగా, ఆరు దరఖాస్తులు అందాయి. శనివారం నగరంలోని జడ్పీ కార్యాలయంలో లాటరీ విధానంలో బార్లను కేటాయించనున్నారు.

దరఖాస్తులు ఇలా..

ప్రభుత్వం జిల్లాలో 50 బార్లకు, గీత కులాలకు 5 బార్లకు (మొత్తం 55) వ్యాపారులు దరఖాస్తు చేసుకునేం దుకు అవకాశం కల్పిం చింది. ఈనెల 26 వరకే బార్లకు దరఖా స్తులు చేసుకునే అవకాశం కల్పించినా, వ్యాపారుల నుంచి ఆదరణ రాలేదు. దీంతో ఈనెల 29 వరకు గడువు పొడిగించింది. 30న లాటరీలో బార్లు కేటాయిం చేలా ఉత్తర్వుల జారీ చేశారు. ఈ క్రమంలో ఈ నెల 29 సాయంత్రం 5 గంటల వరకు నగరంలో 38 బార్లకు సంబంధించి 10 బార్లకు 4 దరఖాస్తులు అం దాయి, ఇక కావలిలో ఏడు బార్లకుగానూ రెండు బార్లకు ఎనిమిది దరఖాస్తులు, కందుకూరులో మూడు బార్లకు 12 దరఖాస్తులు అందాయి. ఇక బుచ్చిలో ఒక బారుకు, ఆత్మకూరు, అల్లూరులో ఒక బారుకు దరఖాస్తులు అందలేదు. ఇక గీత కులాలకు సంబంధించి జిల్లాలో 5 బార్లను కేటాయించగా నెల్లూరులోని రెండు బార్లకు తొమ్మిది దరఖాస్తులు, కావలిలో ఒక బారుకు ఆరు దరఖాస్తులు, కందుకూరులో ఒక బారుకు మూడు దరఖాస్తులు, అల్లూరులో ఒక బారుకు ఒక దరఖాస్తు మాత్రమే అందాయి. అయితే ఒక్కో బారుకు నాలుగు దరఖాస్తులు అందాలని, ఒక్కరే నాలుగు దరఖాస్తులు వేయకూడదన్న నిబంధనలు ఉన్నాయి.

ప్రభుత్వమే తగ్గాలి

బార్లకు సంబధించి ప్రభుత్వం విడుదల చేసిన నూతన పాలసీ ప్రస్తుత బార్ యాజమాన్యాలకు నచ్చలేదు. ఈ క్రమంలో వారు మొదటి నుంచి బార్ పాలసీని వ్యతిరేకిస్తున్నారు. అసలు ఎవరూ దరఖాస్తులు వేయకుంటే ప్రభుత్వమే దిగి వస్తుందని భావించిన బార్ల యాజమాన్యం అసోషియేషన్ నాయకులు దరఖాస్తులు ఎవరూ వేయకూడదని నిబంధన పెట్టుకున్నారు. అయితే కొందరు మాత్రం బార్లకు దరఖాస్తులు దాఖలు చేసేశారు. ప్రస్తుతం బార్లు ఉన్న యాజమాన్యంలో అధికంగా కూటమి ప్రభుత్వానికి చెందిన వారు ఉండటం, వారు ప్రభుత్వ బార్ పాలసీను వ్యతిరేకించడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి ప్రమాదకర జ్వరాలు వ్యాపించకుండా పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష కోరారు. శుక్రవారం 17వ సచివాలయం పరిధిలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. గృహ సముదాయాల పరిసరాల్లో ఉండే ఉపయోగంలో లేని వస్తువులలో వర్షపునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, ఉపయోగంలో లేని కూలర్లలో నిలిచి ఉన్న నీరు, టైర్లు, తొట్టెలు, కుండీలలో వర్షపునీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

మిగిలి ఉన్న ప్లాట్లకు త్వరలో లాటరీ

● ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలించిన జేసీ



జమ్మలపాలెం నుడా ఎంఐజీ లేఅవుట్‌లో పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

జలదంకి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలోని ఎన్టీఆర్ స్మార్ట్ సిటీ ఎంఐజీ లేఅవుట్‌లో మిగిలి ఉన్న ప్లాట్లకు త్వరలో లాటరీ విధానం ద్వారా వేలం వేస్తామని నుడా వైస్‌ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. కొందరు ప్లాట్ల యజమానులు మౌలిక వసతులు కల్పించలేదని ఫిర్యాదు చేయగా శుక్రవారం ఆయన నుడా అధికారులతో కలసి ఎంఐజీ లేఅవుట్‌ను, బ్రోచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నుడా ఈఈ చంద్రయ్యతో మౌలికవసతులపై చర్చించారు. మిగిలి ఉన్న మౌలికవసతులు ఎందుకు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబుక్‌లు తన ముందుంచాలని తెలిపారు. అలాగే కేటాయించని ప్లాట్ల వివరాలపై ఆరా తీశారు. లేఅవుట్‌కు సమీపంలోని భూముల వివరాలను తహసీల్దారు ప్రమీలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 27 ఎకరాల భూముల వివరాలు తహసీల్దారు తెలియజేయగా వీటిలో ప్రభుత్వ ప్రైవేటు భూముల గురించి ఆరాతీశారు. అనంతరం జేసీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మిగిలిపోయిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. అవసరమైతే చుట్టుపక్కల భూములు సేకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెంచలరెడ్డి, ఎస్టేట్ అధికారి డానియేలు పీటర్, ఆర్ఐ నరిసింహారావు, వీఆర్వో గిరిధర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డులో లైన్‌వర్క్ ఉన్నందున ఉదయం ఆరున్నర నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. పామూరురోడ్డు ఫీడర్ పరిధిలోని కొత్త కుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరుబస్టాండ్ ఏరియా, వెంకటేశ్వరనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కావలి రైతు బజారులో కిలో ఉల్లి రూ.12



రైతు బజారులో ఉల్లి పాయలు అందచేస్తున్న మధుబాబు

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కావలి రైతు బజారులో కిలో ఉల్లిపాయ లు రూ.12లకే ప్రభుత్వం అందచేస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు బజారు ఎస్టేట్ అధికారి మధుబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఉల్లి అమ్మకాలను రైతు బజారులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన ఉల్లి పాయాలను తక్కువ ధరకు అందిం చాలనే దృడసం కల్పంతో రైతు బజారులలో విక్రయాలు ప్రారంభించిం దన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమైన వారికి ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామని ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యలు తెలిపారు. కావలి భవిత పాఠశాల పిల్లలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి స్ర్కీనింగ్ పరీక్షలు చేశారు. భవిత పాఠశాల పిల్లల విజయగాథను వారి తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని సంతోషించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో పెంచలయ్య, ఇన్‌చార్జి కోఆర్డి నేటర్ ప్రసాద్, జలదంకి ఎంఈవో పద్మనాభం, హెచ్‌ఎం మాధవ్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణకు సత్కారం



హెచ్‌ఎం రమణను అభినందిస్తున్న డిప్యూటీ ఈవో హరిప్రసాద్

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయపాలెం జిల్లా పరిషత్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు పాతూరి వెంకటరమణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఆ పాఠశాలలో జరిగింది. ఉపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కావలి ఉపవిద్యాశాఖాధికారి ఎం. హరిప్రసాద్ మండల విద్యాశాఖ అధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, సర్వాయపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాగంటి మురళి, తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న వెంకటరమణ దంపతులను సత్కరించారు.

టీఆర్ఆర్‌లో మెగా జాబ్‌మేళా

కందుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్డీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 268 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా 15 ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి 126 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయి. మరో 32 మందికి వెయింటింగ్ లిస్టులో ఆఫర్‌లెటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు విశేషస్పందన లభించిందని, ఎంపికైన వారిలో 53 మంది తమ కళాశాల విద్యార్థులు ఉండడం తమకెంతో సంతోషదాయకమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్డీసీ అధికారి ఓ.జనార్దన్, సీడ్ ఆఫ్ ట్రైనర్ సీహెచ్ శ్రీనివాసరావు, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటరు పీ.రాజగోపాలబాబు, వైస్‌ప్రిన్సిపాల్ ఏడుకొండలు నరేంద్ర, కె.సుజాత, ఎన్వీ శ్రీహరి, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఉలవపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగొల్లు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు చెప్పిన వివారాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి చెన్నైకు కారులో వెళుతున్న తండ్రి కోడుకులు రత్నవేలు, ఆర్ గాంధీ మార్గమధ్యలో చాగొల్లు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇరువురకి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఇద్దరిని కారులో నుంచి బయటకు తీశారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

రోడ్డుపై చెత్త డబ్బాలు..!

● చెల్లాచెదురు చేస్తున్న పందులు ● దుర్వాసన, అపరిశుభ్రతతో ప్రజల అవస్థ

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ఎక్కడా రోడ్లపై చెత్తా చెదారం కుప్పలు కనిపించకుండా మున్సిపల్ అధికారులు చేపట్టిన వినూత్న పథకానికి అక్కడక్కడ కొందరు సిబ్బంది తూట్లు పొడుస్తున్నారు. ఆర్వోబీ వంతెన పక్కన రోడ్డుపై పెట్టిన చెత్త డబ్బాలను పందులు కింద పడేసి చెల్లా చెదరం చేయడం తరచూ జరిగే పనే. వాస్తవంగా అక్కడ చెత్త చెల్లా చెదారం చేయటమే కాక ఆ చెత్త కోసం వాటి డబ్బాలను కింద పడేసి దానిలో ఉన్న చెత్తను బయటకు లాగుతుండటంతో ప్లాస్టిక్‌తో కూడిన ఆ డబ్బాలు కూడా పగిలి పాడై పోతున్నాయి. గతంలో మున్సిపాలిటీలో ఉన్న చెత్త డంపర్ బిన్‌లను తొలగించి అక్కడక్కడ ఐరన్ మెస్‌లతో తయారు చేసిన బాక్స్‌లను పెట్టారు. చెత్తతో నిండిన ఆ డబ్బాలను అందుబాటులో ఉన్న చెత్త వాహనాలకు ఇవ్వడం, అవి అందుబాటులో లేకపోతే ఐరన్ మెస్‌తో తయారు చేసిన బాక్స్‌లలో పెట్టి తలుపులు వేస్తే చెత్త ట్రాక్టర్లు వచ్చి ఆ డబ్బాలలో ఉన్న చెత్తను తీసుకెళ్లి తిరిగి ఆ డబ్బాలను ఐరన్ బాక్స్‌లలో పెట్టేవారు. దీంతో పట్టణంలో చెత్త కుప్పలు కనిపించకుండా ఉండేవి. అయితే కొందరు దానికి తూట్లు పొడుస్తూ చెత్త డబ్బాలను రోడ్డుపై పెట్టి వెళుతుండటంతో చెత్త ట్రాక్టర్ వచ్చి వాటిని తీసుకు వెళ్లే లోపు వాటిని పందులు చెల్లా చెదురు చేస్తున్నాయి. దీంతో అపరిశుభ్రతతోపాటు దుర్వాసన వెదజల్లుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు, ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డుపై పెట్టిన చెత్త డబ్బాల్లో చెత్తను చెల్లాచెదురు చేస్తున్న పందులు

గంగమ్మ చెంతకు గణనాథులు



కావలిరూరల్ : వినాయక విగ్రహాలను నిమజ్జనానికి మోసుకెళుతున్న భక్తులు



కొండాపురం : భీమవరప్పాడులో జరుగుతున్న గణనాథుడి గ్రామోత్సవం



కలిగిరి : గణేశుని నిమజ్జనంలో మహిళల సందడి

కావలిరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో మూడవ రోజైన శుక్రవారం గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక మండపాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాలు, లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ముసునూరులోని మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూను ముసునూరు కమ్మపాలెంకు చెందిన తల్లపనేని మోహన్ రూ. 53,000లకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం వాహనాలల్లో స్వామివారిని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీరప్రాంతాల్లో గంగమ్మ చెంతకు గణపయ్యలను చేర్చి నిమజ్జనం చేశారు. సముద్రం కసురుమీద ఉండటం తో నిమజ్జనం అనంతరం కొద్దిసేపటికే కొన్ని విగ్రహాలు తీరానికి కొట్టుకు వచ్చాయి. విగ్రహాల నిమజ్జనానికి పెద్దఎత్తున ప్రజలు తరలివస్తుండటంతో డీఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐలు, మెరైన్ పోలీసులు తీరం వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తూ డ్రోన్‌తో నిఘా ఉంచారు. మండలంలోని చెన్నాయపాలెం సముద్రతీరంలో వినాయక నిమజ్జనం అనంతరం సముద్రంలో మునుగుతుండగా జలదంకి మండలం జమ్మలపాలెంకు చెందిన ఆలూరి మహేష్ అలల తాకిడికి సముద్రం లోపలికి కొట్టుకుపోయాడు. మహేష్ బంధువులు గుర్తించి పెద్దగా కేకలు వెయ్యడంతో అక్కడ గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు ఆవుల రమేష్, అక్కిలిగుంట మాల్యాద్రిలు లైఫ్ జాకెట్లతో సముద్రంలోకి వెళ్లి నీటిలో కొట్టుకుపోతున్న మహేష్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంకు చెందిన గణేష్ విగ్రహంతో నిమజ్జనానికి వెళ్లే ట్రాక్టర్ కావలి ఆర్వోబీ ఎక్కే సమయంలో వంతెన దిమ్మెను ఢీకొంది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదాలు లేక పోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అట్టహాసంగా నిమజ్జనం

● **కొండాపురం** : వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గణనాథుల విగ్రహాలకు శుక్రవారం నిమజ్జన కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. 3వరోజు బీమవరప్పాడు, గుడవళ్లూరు, తూర్పుఎర్రబల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనం కొరకు సమీప చెరువలకు తరలించారు. భక్తులు చిన్నా పెద్దా తేడాలేకుండా అనందోత్సవాలలో మునిగిపోయారు.

భక్తులకు అన్నదానం

● **అల్లూరు** : వినాయకచవితిని పురస్క రించుకొని మూడు రోజైన శుక్రవారం అల్లూరు పట్టణ పరిధిలోని అన్నదాతవారి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ముందుగా స్వామికి ప్రత్యేక ప్రసాదాలతో నైవేద్యాలను సమర్పించారు.

మహిళల సందడి

● **కలిగిరి:** మూడు రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథులు శుక్రవారం నిమజ్జనానికి తరలి వెళ్లారు. వినాయక మండపాల వద్ద స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను భక్తులు వేలంలో పోటాపోటీగా తలపడి కైవసం చేసుకున్నారు. కలిగిరి పంచాయతీ పరిధిలోని పాపనమునిలిపాలెంలో పాపన హజరత్‌రెడ్డి రూ.41 వేలకు వేలంలో పాటపాడి లడ్డూను దక్కించుకున్నారు. మండపాల నుంచి వినాయక విగ్రహాలను మేళతాళాలు, తప్పెట్ల మోతల నడుమ రంగులు చల్లుకుంటూ, డీజేల మోతలతో గ్రామోత్సవం అనంతరం స్థానికంగా ఉన్న ఉత్తరకాలువతో పాటు కావలికి సమీపంలోని తుమ్మలపెంట సముద్రతీరానికి తీసుకెళ్లి నిమజ్జనం గావించారు.

బొజ్జగణపయ్య గ్రామోత్సవం

● **జలదంకి** : వినాయక ఉత్సావాల్లో భాగంగా మూడో రోజు మండలంలోని పలుగ్రామాల్లో బొజ్జగణపయ్యల నిమజ్జన కార్యక్రమం ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో స్థానిక నీటివనరుల్లో గణనాథులను నిమజ్జనం చేయగా మరికొందరు కావలి ఉమండలంలోని సముద్రతీర ప్రాంతాలకు తరలించారు.



జలదంకి : గ్రామోత్సవంలో బొజ్జగణపయ్య



లింగసముద్రం : గణనాథుని ఊరేగింపులో చిందులు వేస్తున్న యువకులు



అల్లూరు : అన్నదాతవారివీధిలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో..

● **లింగసముద్రం** : మండలంలోని లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం, పెదపవని, చినపవని, మేదరమెట్ల పాలెం గ్రామాలలో వినాయకుడి విగ్రహాలను వైభవం గా నిమజ్జనం చేశారు. రాత్రి 10 గంటలు దాటిన తరు వాత, రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గైండ్‌బండ్‌లో, ఉప్పుటేరులో, స్థానిక చెరువులలో గణనాథుని విగ్రహా లను నిమజ్జనం చేశారు.

సముద్రతీరంలో ఉత్సాహంగా...

● **చిత్రగుంట:** బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయతీ నుంచి దాదాపు 16 విగ్రహాలు శుక్రవారం తాటిచెట్లపాలెం సముద్రతీరానికి చేరాయి. స్థానిక ఎస్ఐ ప్రభాకర్‌రావు, అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనం చేశారు. ఇతర మండలాల నుంచి దాదాపు 70 వినాయక విగ్రహాలు సముద్రంలో నిమజ్జనానికి వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. వందలాది మంది భక్తులు సముద్రస్నానాలు ఆచరించారు.



చిత్రగుంట : గణేశ్ నిమజ్జనానికి వచ్చి సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు



ఉలవపాడు : సముద్రంలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

ప్రత్యేక ఆకర్షణగా గణనాథులు

● **కందుకూరు** : గణేశ్ నవరాత్రి ఉత్సవాల కోసం కందుకూరు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలు స్తున్నాయి. పట్టణంలోని వాసవీ నగర్ కాలనీ, పోస్టాఫీసు సెంటర్‌లోని దేవుడు అరుగుల వద్ద పర్యావరణ హిత మట్టి గణపతి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్తంటివారిపాలెంలో ఏర్పాటు చేసిన మహాశివగణేశుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కందుకూరు : పోస్టాఫీసు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మట్టిగణపతి విగ్రహం

వైభవంగా వినాయకుడి నిమజ్జనం

● **ఉలవపాడు** : మండలంలో వినాయకుడి విగ్రహాల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో నెలకొల్పిన గణేష్‌ని విగ్రహాలను కోలాహలంగా, డీజే, డప్పు వాయిద్యాలు, రంగులు చల్లుకుంటు నృత్య ప్రదర్శలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం, రామాయాపట్నం, కరేడు, చాకిచర్ల, పెద్దపట్టపుపాలెం సముద్రంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు చర్యలు చేపట్టారు.

'రాళ్లపాడు'లో నిమజ్జనం చేయొద్దు

లింగసముద్రం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని ప్రాజెక్టు డీఈఈ ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాళ్లపాడు ప్రాజెక్టు పరిసర గ్రామాల ప్రజలు ఎప్పటిలాగే ప్రతి ఏటా ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే ముందు భాగంలోని గైడ్‌బండ్‌లో నిమజ్జనం చేసుకోవాలని పేర్కొన్నారు. అయితే రాళ్లపాడు ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వలు బాగా తగ్గినందు వలన వినాయకస్వామి విగ్రహాలను ఇందులో నిమజ్జనం చేస్తే మంచినీటిలో విగ్రహాల రసాయనాలు కలిసి నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ముగ్గురు లస్కర్లను నియమించినట్లు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక విట్స్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల విద్యార్థిని, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఈ కార్యక్రమంలో విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.అనిల్‌కుమార్, డాక్టర్ రజ్వీ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ గిరీష్ గాంధీ, పీడీ భాస్కర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని కళవళ్లలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కళవళ్ల, నలదలపూరు, శాఖవరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. బడేవారిపాలెం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం

● తాటికొండ మధుబాబు, విద్యుత్ ఏఈ, వలేటివారిపాలెం

వలేటివారిపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు, రైతులకు సకాలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ తాటికొండ మధుబాబు తెలిపారు.

? మండలంలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

! మండలంలో 2600 వ్యవసాయ, 10,100 గృహ, వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి.

? విద్యుత్ సిబ్బంది కొరత ఉందా.

! మండలంలోని నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో పోకూరు, చుండి, పోలినేనిపాలెం, వలేటివారిపాలెం, ఉప్పలపాడు, మాలకొండ, శింగమనేనిపల్లె గ్రామాల్లో సిబ్బంది కొరత ఉంది. మొత్తం 23 మంది సిబ్బందికి 16 మంది మాత్రమే ఉన్నారు.

? దెబ్బతిన్న స్తంభాలు, కిందకు వేలాడుతున్న తీగల సమస్యను ఎలా పరిష్కరిస్తారు.

! ప్రభుత్వం చేపట్టిన ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్ ద్వారా గ్రామాల్లో విద్యుత్ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. మెరుగైన విద్యుత్‌ను అందిస్తాం. ఇప్పటికే పోలినేనిచెరువు, పెదఅమ్మపాలెం, చుండి గరుకుపాలెం, కాకర్లపాలెం గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయి.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

చిత్రగుంట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. మేరా యువభారత్ నెల్లూరు, అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయింతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలురు విభాగంలో వాలీబాల్, కబడ్డీ, బాలికలకు ఖోఖో, రింగ్‌బాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సెట్నల్ అధికారి శ్రీనివాసులు, జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలశైలజ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఐటీ విభాగం జిల్లా ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా మాల్యాద్రి

లింగసముద్రం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐటీ విభాగం జిల్లా ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెంకు చెందిన మట్టె మాల్యాద్రిని నియమించారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరెడ్డి, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మట్టె వేణుగోపాల్, షేక్ షఫి, పి తిరుపతిరెడ్డి, తదితరులకు ఆయన కృతజ్ఞలు తెలిపారు.

వెరైటీ వినాయకులు..



పొదలకూరు : సూర్యప్రభ అలంకరణలో లక్ష పుష్పాలతో విఘ్నేశ్వరుడు



కావలి : పట్టణంలోని వైకుంఠపురం రామాలయం సెంటర్‌లో..



సంగం : గాంధీజన సంఘంలో రాముడి వేషధారణలో.



ఉదయగిరి : సర్వరాబాదులో కరెన్సీ నోట్లతో అలంకరణ



పొదలకూరు : అంజనీసుతుడిపై విఘ్నేశ్వరుడి వైభవం

ఓటీపీతో రిజిస్ట్రేషన్లకు కష్టాలు

- ముందస్తు ఫీజు చెల్లింపుతో ఇక్కట్లు
- రద్దు చేయాలంటున్న డాక్యుమెంట్ రైటర్లు

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భూములు, స్థలాల క్రయవిక్రయాల దస్తావేజుల రిజిస్ట్రేషన్ సందర్భంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం తీసుకొచ్చిన ఈ విధానం అమలు అస్తవ్యస్తంగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు క్రయ, విక్రయ దారులకు సంబంధించిన ఫోన్లకు ఓటీపీ వెళుతుంది. ఆ నంబరు చెబితేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. లేకపోతే లేదు. ఏదైనా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ముందుగా స్లాట్ బుక్ చేసుకుని అందులో ఇచ్చిన సమయానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. ఇందువల్ల జాప్యం లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఈ పద్ధతి మంచి ఫలితాలను ఇవ్వటంతో మరోసేవను రిజిస్ట్రేషన్‌శాఖ అందుబాటులోకి తీసుకుని వచ్చింది. దస్తావేజు



రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే కొనుగోలు చేసిన వ్యక్తి మొబైల్‌కు రిజిస్టర్ అయిన దస్తావేజు వాట్సప్ ద్వారా వస్తుంది.

● ముందస్తు చెల్లింపులతో ఇక్కట్లు

ఆస్తి లావాదేవీలకు ఆస్తి విలువను బట్టి స్టాంపు డ్యూటీ, ఫీజులు, యూజర్ చార్జీ ముందుగానే ఆన్‌లైన్‌లో చలానా రూపంలో చెల్లించి పబ్లిక్ డేటాలో ఎంటర్ చేయటం వలన అవినీతికి ఆస్కారం ఏర్పడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విధానం రాక ముందు ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దస్తావేజులు పూర్తిచేసి పబ్లిక్ డేటా ఎంటర్ చేసి, చెక్‌స్లిప్ వేసిన తరువాత సబ్‌రిజిస్ట్రార్ పరిశీలిస్తారు. అనంతరం స్టాంపుడ్యూటీ, ఫీజు, యూజర్ చార్జీలు చెల్లించే వారు. అనంతరం రిజిస్ట్రేషన్ జరిగేది. ఈ విధానం బాగుండేది. కాని కొత్తగా ఆస్తివిలువలను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజులు ఒకేసారి చలానాల ద్వారా ముందుగా చెల్లించి పబ్లిక్ డేటాలో ఎంటర్ చేయాల్సి వస్తోంది. ఈ విధానంలో ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించటం వలన, కొంతమంది అవినీతి పరులైన సబ్‌రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేసే సందర్భంలో వేలకు వేలు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● ఇంటి పన్నులు మారతాయో... లేదో...?

ఆటోమ్యూటేషన్ విధానం అమలు లోకి రావటంతో డోర్ నంబరు, ఆస్తి అసెస్మెంట్ నంబరు వ్యవహారంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆటో మ్యూటేషన్ రిజిస్ట్రేషన్ కోసం పబ్లిక్ డేటాలో ఇంటి డోర్ నంబరు ఫీడ్ చేస్తే, అసెస్మెంట్ నంబరు కంప్యూటర్ డేటాలో కనిపించటం లేదు. అసెస్మెంట్ నంబరు ఫీడ్ చేస్తే, ఇంటి డోర్‌నంబరు కనిపించటం లేదు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులకు సంబంధించి ఇంటి పన్నులు మారుతాయో లేదో అనే భయాందోళనల్లో రిజిస్ట్రేషన్‌దారులు ఉన్నారు.

ఓటీపీ విధానం రద్దు చేయాలి



దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ప్రవేశపెట్టిన ఓటీపీ విధానం వలన రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలి. ఈ విధానంతో అందరి ఓటీపీలు చెప్పాల్సి రావటంతో రిజిస్ట్రేషన్‌కు విఘాతం కలుగుతోంది. ఒక రిజిస్ట్రేషన్‌కు రెండు నుంచి మూడు రోజులు పడుతోంది. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఓటీపీ విధానాన్ని రద్దు చేయకపోతే ఉద్యమం చేస్తాం.

- పట్నం దుర్గేష్‌బాబు, జిల్లా డాక్యుమెంటు రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు



జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌తో రామకృష్ణాపురం గ్రామం ఎస్టీ బాధిత మహిళలు

గిరిజన మహిళల ఫిర్యాదుపై జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ

ఉలవపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తమపై కేసులు బనాయించి పోలీసులు వేధిస్తున్నారన్న మండలంలోని రామకృష్ణాపురంకు చెందిన బాధిత మహిళల ఫిర్యాదుపై జాతీయ ఎస్టీ కమిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ పక్కన ఉన్న దిల్‌కుషా అతిథి గృహంలో విచారణ చేపట్టింది. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోత్ హుస్సేన్ నాయక్ రామకృష్ణాపురం గిరిజన మహిళలతోపాటు కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను విచారణ చేపట్టారు. కరేడు భూసేకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా గ్రామంలో కట్టుబాటు ప్రకారం నడుచుకుంటుండగా జరిగిన ఘర్షణలో మాణికల శిరీష, సుజాత, లలితలపై అదే గ్రామానికి చెందిన శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై అర్ధరాత్రి పోలీసులు వ్యవహరించిన తీరు, అక్రమంగా తమని జైలుకు పంపించిన విధానంపై బాధిత మహిళలు ఆయనకు వివరించారు. అసలేమి జరిగిందనే విషయాన్ని డీఎస్పీ వివరించారు. ఇండోసోల్ భూసేకరణ, గిరిజన మహిళలపై పెట్టిన కేసుల వివరాలకు సంబంధించి 15 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను అనంతరం కమిషన్ సభ్యుడు ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. త్వరలో గ్రామంలో స్వయంగా పర్యటిస్తానని, అంత వరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించినట్లు తెలిపారు. బాధిత గిరిజన మహిళల వెంట ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీరాం నాయక్, ఉలవపాడు సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు జీవీబీ కుమార్, జిల్లా గిరిజన సంఘం నాయకులు చేవూరి రాంబాబు, రాచూరి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

- రూ.9.50 లక్షల ఎరువుల సీజ్

లింగసముద్రం: కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో లింగసముద్రం, కందుకూరు వ్యవసాయశాఖ అధికారులు బీ.రవి కుమార్, షేక్ అబ్దుల్ రహీంలు మండలంలోని లింగసముద్రం, పెదపవని, చినపవని, వీఆర్ కోట గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెదపవనిలోని రెండు, లింగసముద్రం లోని రెండు ఎరువుల దుకాణాలలో సరియైన పత్రాలు లేకుండా నిల్వ ఉంచిన రూ.9.50 లక్షల ఎరువులను గుర్తించి సీజ్ చేశారు. తమ అనుమతి లేకుండా ఆ ఎరువులను విక్రయిస్తే షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని ఆయన డీలర్లను హెచ్చరించారు.



పెదపవనిలోని ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న కావలి ఏడీఏ నాగరాజు

గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక



ఎంపికయిన జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పెన్షనర్లకు 010 పద్దు కింద జీతాలు, పింఛన్లు ఇవ్వాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ.మల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పెన్షనర్స్ రాష్ట్ర నాయకులు కే. త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపాలిటీలు, పంచాయతీలు బకాయిపడిన రూ.1062 కోట్లను జిల్లా గ్రంథాలయ సంస్థలకు జమ చేసేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

● కార్యవర్గం ఎంపిక

జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం ఎంపికైంది. నగరంలోని మహిళా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఏ.గోవిందరావు, సలహాదారులుగా ఆర్. దశరథరామిరెడ్డి, రాష్ట్ర ప్రతినిధిగా ఐ.సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా వీ.రంగారావు, ఉపాధ్యక్షులుగా సుభాష్ చంద్రగుప్త, ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా డీ.జయమ్మ, నిర్వాహక కార్యదర్శిగా వీ.సుధాకరాచారి, కోశాధికారిగా ఈ.ఏడుకొండలు, ఇతర సభ్యులు ఎంపికయ్యారు. ఎంపికైన కమిటీని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా అభినందించారు.

తెలుగు భాషోత్సవాల ప్రారంభం

- 31 వరకు నిర్వహణ
- ముఖ్యఅతిథిగా పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వివిధ సాహితీ ప్రక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సేవ తెలుగు భాషా సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే తెలుగుభాషోత్సవాలు నెల్లూరు పురమందిరంలో శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పూర్వఉపరాష్ట్రపతి ఎంపీ వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రసారభారతి విశ్రాంత అదనపు డైరెక్టర్ డాక్టర్ రేవూరు అనంతపద్మ నాభరావు అధ్యక్షత వహించారు. తెలుగుభాషా పరిరక్షణకు వెంకయ్యనాయుడు, దిశా నిర్దేశం చేశారు. ఈ సభలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ కీలకోపాన్యాసం చేశారు. గిడుగు ఆలోచనల మేరకు తెలుగు భాషను ఆలోచనా పరగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అందుకు నేటితరం చేపట్టాల్సిన కార్యాచరణ వివరించారు. అ.జో.వి.భో ఫౌండేషన్ చైర్మన్ అప్పాజోష్యుల సత్యనారాయణ మాట్లాడుతూ ఉపన్యాసాలతో తెలుగు భాషను రక్షించుకోలేమన్నారు. చైనాలో వారి మాతృభాషలోనే చదువు, పరిపాలన అన్నీ పనులు చేస్తున్నారని, అందుకే ఆ దేశం అభివృద్ధి చెందిందన్నారు. తెలుగు భాషను అన్నీ రంగాలలో వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ గజల్ పాడి సభికులను అలరింపచేశారు. అనంతరం చిన్నారుల ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. ఆ చిన్నారులను వెంకయ్య నాయుడు అభినందించారు. వారితో ఫొటో దిగి మెమోంటో అందించారు. కాగా మధ్యాహ్నం ప్రాచీన సాహిత్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సును అప్పాజోష్యుల సత్యనారాయణ (అమెరికా) ప్రారంభించారు. కథకులు, విమర్శకులు ఆచార్య పాపినేని శివశంకర్ కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం కవితోత్సవం నిర్వహించారు. రాత్రి తిక్కన సాహిత్య సదస్సు జరిగింది. ఈ సదస్సును అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ ప్రారంభించారు. కవి సంధ్య సంపాదకులు ఆచార్య శిఖామణి కీలకోపన్యాసం చేశారు. డాక్టర్ పాతూరి అన్నపూర్ణ అధ్యక్షతన కవితోత్సవం నిర్వహించారు. ఈ సభలో వెంకయ్య నాయుడు అతిథులు, కార్యక్రమానికి సహకరించిన వారిని సన్మానించి, మెమోంటోలు అందజేశారు. అనంతరం గిడుగు వారసురాలు గిడుగు సరస్వతిని సన్మానించారు. చివరిగా బాల సాహిత్య సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సభాధ్యక్షులుగా డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, విశిష్ట అతిథులుగా డాక్టర్ డీకే చదువుల బాబు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, చంద్రలత, డాక్టర్ కందిపి రాణీప్రసాద్, దార్ల బుజ్జయ్య, టీ. రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో నలుబోలు బలరామయ్య నాయుడు, పీఎంసీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, రచయితలు అవ్వారు శ్రీధర్‌బాబు, చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, దగ్గుబాటి రాధాకృష్ణ, గోవింద రాజు సుభద్రాదేవి పాల్గొన్నారు. తొలిరోజు కార్యక్రమాలను విజయవంతం చేసిన అతిథులు, ఉపన్యాసకులు, కవులకు సేవా సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు కృతజ్ఞతలు తెలిపారు.





సభలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు, హాజరైన ప్రజలు

క్షేత్ర సహాయకుడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో ఉపాధి నిధులు స్వాహా చేశాడని వచ్చిన ఆరోపణల పట్ల క్షేత్ర సహాయకుడిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి నోటీసులు జారీ చేశారు. పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.2,50,624 లక్షల నిధులు దుర్వినియోగం చేశారని, తన కుటుంబ సభ్యులతోపాటు మరికొంతమంది వేతనదారుల నకిలీ సంతకాలు, వేలిముద్రలు మస్టర్లపై వేసినట్లు విచారణలో తేల్చారు. అలాగే ఉద్యోగులు, విద్యార్థులు, మరణించిన వారికి మస్టర్లు వేసి నిధులు స్వాహా చేసినట్లు నోటీసులో పేర్కొన్నారు. అధికారులు చేపట్టిన విచారణకు సహకరించకపోవడం, అతనిపై వచ్చిన ఆరోపణలు వాస్తమని తేలినట్లు నోటీసులో పేర్కొన్నారు. దీంతో అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ సూచించారు. ఈ విషయాన్ని మండల అధికారులు సైతం ధ్రువీకరించారు.

కిలో ఉల్లి రూ.12లకే!

రైతుబజార్లలో అమ్మకాలు

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల కోసం రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.12లకు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నుంచి శుక్రవారం 5 టన్నుల ఉల్లిపాయలను జిల్లాకు దిగుమతి చేసుకున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. కావలి, కందుకూరు రైతుబజార్లకు ఒకటిన్నర టన్నుల చొప్పున, నెల్లూరులోని నవాబుపేట, పత్తేఖాన్‌పేట రైతుబజార్లకు టన్ను చొప్పున రెండు టన్నులు కేటాయించారు. కావలి, కందుకూరులలో శుక్రవారం సాయంత్రమే ఉల్లిపాయలు విక్రయించగా, నెల్లూరులో శనివారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఏడీ తెలిపారు. పొదలకూరు రైతుబజారుకు మాత్రం మరో విడతలో పంపించే అవకాశం ఉంది.

గణనాథుడి నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

- బాణసంచా పేలి 10 మంది చిన్నారులకు తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గణనాథుడి నిమజ్జనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకొంది. ట్రాక్టర్‌లో ఉంచిన బాణసంచా ప్రమాదవశాత్తు పేలి 10 మంది చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనోత్సవానికి తరలుతున్నారు. ఈ సమయంలో సమీప గ్రామమైన నడింపల్లిలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని సైతం అదే మార్గంలో నిమజ్జనోత్సవానికి వెళుతున్నారు. కాగా, నడింపల్లి వాహనం ముందు బాణసంచా పేల్చడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి అప్పసముద్రం ట్రాక్టర్‌లో ఉన్న బాణసంచాపై పడ్డాయి. దీంతో అవి ఒక్కసారిగా పేలడంతో ట్రాక్టర్‌లో బాణసంచా పక్కనే కూర్చొని ఉన్న కార్తీక, రోహిత్ రెడ్డి, బాబు, మధురిమ, ప్రవల్లికలతోపాటు మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుటాహుటిన తమ వాహనాల్లో చికిత్స నిమిత్తం దుత్తలూరుకు తరలించారు. అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొందర్ని వింజమూరు, మరికొందర్ని ఆత్మకూరు వైద్యశాలలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అల శ్రీను వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులు



అవార్డు అందుకుంటున్న పాఠశాల సిబ్బంది

బీవీఎస్ పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

నెల్లూరు(విద్య), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని నవాబుపేట బీవీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు శుక్రవారం అవార్డును అందచేసి మాట్లాడారు. పాఠశాలల్లో క్రీడల నిర్వహణలో బీవీఎస్ అత్యధిక పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, స్కూల్ ఎడ్యుకేషన్, ఎస్‌జీఎఫ్‌లు ఈ అవార్డును ప్రకటించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సొంతం చేసుకుని అవార్డులు అందుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఎం.విజయజ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు పీ.అజయ్‌కుమార్, క్రీడాకారులను డీఈవో అభినందించారు.

ఉపాధ్యాయ కొలువుల కోలాహలం

- కొనసాగిన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

నెల్లూరు (విద్య), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2025లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రం యువ ఉపాధ్యాయులతో కోలాహలంగా మారింది. వందలాది మంది అభ్యర్థులు తమ పత్రాలను పరిశీలించుకుంటూ అధికారులతో మాట్లాడుతూ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. నగరంలోని వీఆర్ ఐపీఎస్‌లో రెండురోజులపాటు నిర్వహించిన ఈ ప్రక్రియ తొలిదశ శుక్రవారం రాత్రితో ముగిసింది. మెగా డీఎస్సీ-2025 సంబంధించి అన్ని సబ్జెక్టుల మెరిట్ జాబితాలను ఇప్పటికే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నేపథ్యంలో వివిధ కేటగిరీ పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్ పరిశీలనను విద్యాశాఖ అధికారులు చేపట్టారు. దీనికోసంగా 17 కమిటీల నేతృత్వంలో పరిశీలన కొనసాగింది. డీఈఓ ఆర్.బాలాజీరావు పర్యవేక్షణలో డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలతోపాటు డిప్యూటీ తహసీల్దార్, టెక్నికల్ అసిస్టెంట్స్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, డిసేబుల్డ్ వెల్ఫేర్ శాఖల అధికారులు, గురుకుల విద్యాలయాల ప్రతినిధులు బృందాలుగా హాజరై అభ్యర్థుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం మీద 673 పోస్టులకు గాను 641 మందికి కాల్‌లెటర్స్ అందగా వీరిలో 8 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 32 మందిలో స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు కొంతమందికి విజయవాడలోనే పరిశీలిస్తారని, మిగిలిన వారికి సంబంధించి సర్టిఫికెట్లలో చిన్న సమస్యలున్నాయని, వీటిని నివృత్తి చేసిన అనంతరం రాష్ట్ర అధికారులు పరిశీలిస్తారని డీఈఓ తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు సంబంధించి వైద్య అధికారుల పరిశీలన అనంతరం శనివారం డీఈఓ కార్యాలయంలో పరిశీలన పూర్తి చేసుకుంటారని తెలిపారు.

వివిధ రంగాల్లో గ్రామీణ యువతకు శిక్షణ

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోగోలులోని లావా ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, కోవూరులోని త్రేడ్జ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్స్ ఫీల్డ్ టెక్నీషియన్, కంప్యూటింగ్ పెరిఫెరల్స్, సర్వీస్ ఇంజనీర్-ఐటీ హార్డ్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు కలిగి, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీయువకులు అర్హులన్నారు. శిక్షణ 3 నుంచి 5 నెలలు వరకు ఉంటుందన్నారు. ఉచిత, వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో యూనిఫాం, మెటీరియల్, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని ఆమె వివరించారు. అర్హత కలిగిన వారు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్సు కాపీలతో నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉన్న డీఆర్‌డీఏ-జాబ్స్ విభాగంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 0861-2321261, 9490080861, 8985120012 నంబర్లను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.